Follow: @ANNTELUGU
12-06-2025
ANN తెలుగు
# మహా పత్రిక
గురువారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 190 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## ఎమ్మెల్యే పల్లాకు కేసీఆర్ పరామర్శ

- ఎర్రవెల్లి ఫామ్ హౌస్ బాత్ రూంలో జారిపడ్డ జనగామ ఎమ్మెల్యే
- ఎముక విరిగినట్లు సమాచారం.. యశోద ఆస్పత్రికి తరలింపు
- విచారణ అనంతరం హుటాహుటిన ఆస్పత్రికి కేసీఆర్

వివరాలు 2లో

**టాప్ న్యూస్**

కాళేశ్వరం ప్రాజెక్ట్ అధికారి
### ఇంట్లో ఏసీబీ దాడులు



- ఏకకాలంలో 20 చోట్ల సోదాలు
- కీలక పత్రాలను స్వాదీనం చేసుకున్న అధికారులు
- కరీంనగర్ నుంచి హైదరాబాద్ కు శ్రీధర్ తరలింపు

02

### కేబినెట్ విస్తరణపై స్పందించిన రాజగోపాల్ రెడ్డి



- పదవున్నా.. లేకున్నా ప్రజల కోసమే
- నూతన మంత్రులకు శుభాకాంక్షలు

03

### రాష్ట్రానికి కేసీఆర్ కుటుంబమే ప్రధాన శత్రువు



- నేను ఉన్నంతవరకూ కాంగ్రెస్‌లోకి వారికి నో ఎంట్రీ
- సీఎం రేవంత్ రెడ్డి

02



### ఫ్రీగా విత్తనాలు ఇస్తా..!

- విత్తనాలు వేసుకునే శక్తి లేని వారు క్యాంపు ఆఫీస్ కు రండి
- గుంట జాగా బీడు లేకుండా పంటలు వేయాలి: పొన్నం
- నాగలితో దుక్కి దున్ని విత్తనాలు చల్లిన మంత్రి పొన్నం ప్రభాకర్

వివరాలు 2లో



### స్కిల్ కేపిటల్ ఆఫ్ ది గ్లోబ్ గా తెలంగాణ

- సెమీ కండక్టర్ల తయారీ, డిజైనింగ్‌లో యువతకు శిక్షణ
- 2030 నాటికి 10వేల మందికి ఇచ్చేందుకు స్ప్రింగ్ సెమీ కండక్టర్స్ అంగీకారం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

వివరాలు 2లో



### ప్రభుత్వ బడుల్లోనూ ఎల్‌కేజీ, యూకేజీ

- ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రవేశాలు
- కీలక నిర్ణయం తీసుకున్న తెలంగాణ సర్కార్
- డీఈవోలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ

వివరాలు 2లో




### రాజీవ్ యువ వికాసం

- భారీగా దరఖాస్తుల తిరస్కరణ
- వచ్చినవి 16 లక్షలు
- తిరస్కరణకు గురైనవి 6.6 లక్షలు

వివరాలు 3లో



గడ్డం వివేక్ — మైనింగ్, కార్మికశాఖ | అడ్లూరి లక్ష్మణ్ — సంక్షేమ శాఖ | వాకిటి శ్రీహరి — క్రీడలు, యువజన, పశుసంవర్థకశాఖలు

# శాఖలు ఖరారు

## వివేక్‌కు మైనింగ్, కార్మికశాఖ

### అడ్లూరికి సంక్షేమం.. శ్రీహరికి పశుసంవర్ధకం

- ముగ్గురు మంత్రులకు శాఖలు ఖరారు చేసిన సీఎం
- తన వద్ద ఉన్న కార్మిక శాఖను వివేక్ కు ఇచ్చిన సీఎం
- జూపల్లి, తుమ్మల శాఖల్లో స్వల్ప కోతలు

హైదరాబాద్, మహా

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నూతన మంత్రులకు శాఖలు కేటాయించారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి కీలకశాఖలు దక్కాయి. కార్మిక, ఉపాధి శాఖతో పాటు గనుల శాఖ కూడా దక్కింది. గతంలో తన తండ్రి, సోదరుడు కూడా కార్మికశాఖలు నిర్వహించడం విశేషం. కాకా ఫ్యామిలీకి కార్మికశాఖ ఆనవాయితీగా మారింది. ప్రాధాన్యత కలిగిన మైనింగ్ శాఖ కూడా దక్కింది. అడ్లూరి లక్ష్మణ్ కు : ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖలు, వాకిటి శ్రీహరికి క్రీడలు, యువజన సర్వీసులు, పశుసంవర్ధకశాఖలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

**సీనియర్లను కదపకుండా..**

హోం, రెవెన్యూ, ఆర్థికశాఖలపై కొందరు సీనియర్లు కన్నేయగా, సీనియర్ల శాఖలు మార్చకుండా.. ప్రస్తుతం మిగిలిన శాఖల్లోనే సర్దుబాటు చేశారు. పాత మంత్రుల్లో పని భారం కారణంగా శ్రద్ధ చూపని వాటిని కొత్త వారికి కేటాయించారు. తుమ్మల, జూపల్లి నుండి కొన్ని విభాగాలు కొత్త మంత్రులకు దక్కాయి. ఉత్తమ్ , భట్టి విక్రమార్క తదితరులు పేర్లు వివిధ శాఖలకు వినపడగా, శాఖలపై చర్చ లేదని సీఎం తేల్చేశారు. ముందునుండీ ఊహించినట్లుగానే కొత్త మంత్రులకు శాఖలు దక్కాయి. వివేక్ కు ప్రాధాన్యం దక్కింది.

## కాళేశ్వరం నిర్మాణం అంతా ఇంజనీర్లదే?

### పీసీ ఘోష్ కమిషన్ ఎదుట మాజీ సీఎం కేసీఆర్

డాక్యుమెంట్లతో బీఆర్కే భవన్ వద్దకు గులాబీ బాస్

- 50 నిమిషాలు ఫేస్ టు ఫేస్ విచారించిన కమిషన్
- కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి మంత్రివర్గ ఆమోదంతో పాటు 17 క్వశ్చన్
- కమిషన్ కు పలు డాక్యుమెంట్స్ అందజేసిన కేసీఆర్




**మహా:** ఎట్టకేలకు కాళేశ్వరం కమిషన్ ముందు హాజరైన బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ విచారణ ముగిసింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ అవతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు బుధవారం కేసీఆర్ హాజరయ్యారు. కమిషన్ 50 నిమిషాల పాటు కేసీఆర్ ను విచారించింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో తీసుకున్న నిర్ణయాలపై క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. ఇన్ కెమెరాలో జరిగిన విచారణలో కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్, కమిషన్ కార్యదర్శి మురళీధర్, కేసీఆర్ లు మాత్రమే ఉన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ క్రమంలో 115వ సాక్షిగా కమిషన్ కేసీఆర్ ను ప్రశ్నించింది. ఇప్పటికే కాళేశ్వరం కమిషన్ అవతవకలపై కాగ్, విజిలెన్స్ కమిషన్, ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదికల అంశాలతో పాటు ఘోష్ కమిషన్ ఇప్పటికే ఇంజనీర్లు, ప్రజాప్రతినిధులను, కాంట్రాక్టు సంస్థలను విచారించిన అంశాల నేపథ్యంలో కేసీఆర్ ను ప్రశ్నించింది.

**కేసీఆర్ కు 18 ప్రశ్నలు..**

విచారణ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణలో తాగు, సాగు నీటి పరిస్థితులతో పాటు భారతదేశంలో నీటి లభ్యత, వినియోగంపై కమిషన్ కు వివరించారు.

మిగతా 2లో

### తెలియక తప్పు చేశా..



- లిక్కర్, సౌండ్ సిస్టమ్ కు పర్మిషన్ తీసుకోవాలని తెలియదు
- లోకల్ లిక్కర్ తప్ప ఇతర మత్తు పదార్థాలు లేవు: సింగర్ మంగ్లీ

వివరాలు 8లో

## విచారణల పేరిట రాక్షసానందం

### సీఎం రేవంత్ రెడ్డిని వదిలిపెట్టం

- కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టేదాకా వెంటాడుతాం
- ప్రభుత్వం ఏం చేసినా కేసీఆర్ వెంట్రుక కూడా పీకలేరు
- ప్రభుత్వంపై నోరు పారేసుకున్న మాజీ మంత్రి కేటీఆర్

**మహా:** సీఎం రేవంత్ రెడ్డి మాజీ సీఎం కేసీఆర్ వెంట్రుకను కూడా పీకలేడు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బీఆర్కే భవన్ వద్ద కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ అంటే ఒక చరిత్ర.. ఇరిగేషన్ విషయంలో కేసీఆర్‌ను విచారణకు పిలిచారంటే.. హనుమంతుడి ముందు కుప్పిగంతులు లాంటిది. ఇరిగేషన్ మీద కేసీఆర్‌కు ఉన్న అవగాహన బహుషా

మిగతా 2లో



## కాళేశ్వరం వల్లే బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పిన..

### ప్రపంచంలో అతి పెద్ద ఇంజనీరింగ్ బ్లండర్ కాళేశ్వరం

- దాని పేరుతో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు
- బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



**మహా:** కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణలో వరి దాన్యం దిగుబడి పెరగలేదని, కాళేశ్వరం పేరుతో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని బీజేపీ ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి విమర్శించారు. ఒకప్పుడు మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుపై గొప్పలు చెప్పుకుని.. ఇప్పుడు తప్పించుకుంటున్నారు అని మండిపడ్డారు. కాళేశ్వరం మంచి అయినా, చెడు అయిన బాధ్యుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. ప్రపంచంలో అతి పెద్ద ఇంజనీరింగ్ బ్లండర్ కాళేశ్వరం అని, కాళేశ్వరంలో అవినీతి జరిగినా ప్రాజెక్ట్ కూడా మిగలలేదు అని ఎద్దేవా చేశారు.

మిగతా 2లో

### నేను రాయల్ ఛాలెంజే తాగను.. ఆర్సీబీని కొంటానా?: డీకే శివకుమార్

- ఆర్సీబీ కొనుగోలు వార్తలను కొట్టిపారేసిన కర్ణాటక డిప్యూటీ సీఎం
- ఐపీఎల్ ఫ్రాంచైజీని కొనే ఉద్దేశం తనకు లేదని స్పష్టీకరణ

02



# ఎమ్మెల్యే పల్లాకు కేసీఆర్ పరామర్శ

## ఎర్రవెల్లి ఫామ్ హౌస్ బాత్ రూంలో జారిపడ్డ జనగామ ఎమ్మెల్యే

- ఎముక విరిగినట్లు సమాచారం.. యశోద ఆస్పత్రికి తరలింపు
- విచారణ అనంతరం హుటాహుటిన ఆస్పత్రికి కేసీఆర్

**మహా:** బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ప్రమాదం జరిగింది. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో ప్రమాదవశాత్తూ పల్లా రాజేశ్వర్‌రెడ్డి జారిపడ్డారు. జారీపడటంతో పల్లా తుంటి ఎముకలో గాయమైంది. దీంతో హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి వైద్యం కోసం తరలించారు. బుధవారం కాళేశ్వరం కమిషన్ విచారణకు కేసీఆర్ హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో కేసీఆర్‌ని కలవడనికి బీఆర్ఎస్ కీలక నేతలు, కుటుంబ సభ్యులు గులాబీ బాస్ ఫాంహౌస్‌కి వెళ్లారు. ఈ క్రమంలోనే పల్లా రాజేశ్వర్‌రెడ్డి జారి పడినట్లు తెలుస్తోంది.

**కేసీఆర్ పరామర్శ..**


జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ అనంతరం మాజీ సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని పరామర్శించారు. బీఆర్కే భవన్ నుంచి నేరుగా యశోద ఆసుపత్రికి వెళ్లిన ఆయన పల్లాను పరామర్శించి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

# ఫ్రీగా విత్తనాలు ఇస్తా..!

## విత్తనాలు వేసుకునే శక్తి లేని వారు క్యాంపు ఆఫీస్ కు రండి

గుంట జాగా బీడు లేకుండా పంటలు వేయాలి: పొన్నం

నాగలితో దుక్కి దున్ని విత్తనాలు చల్లిన మంత్రి పొన్నం ప్రభాకర్



**మహా:** రైతులు ఒక్క గుంట కూడా బీడు లేకుండా.. వరి, మొక్కజొన్న, ఆయిల్ ఫాం ఇతర ఏదైనా పంటలు వేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రైతులు ఎక్కడ ఖాళీ జాగా, బీడు లేకుండా చూడాలని సూచించారు. విత్తనాలు వేసుకునే శక్తి లేని వారు తన క్యాంపు కార్యాలయాన్ని సంప్రదించండని తెలిపారు. తాము విత్తనాలు అందిస్తాం అని, రైతులు ఖాళీ జాగా లేకుండా పంటలు వేయాలని కోరారు. రైతులకు ప్రభుత్వం తరఫున ఉచిత విద్యుత్, సాగునీరు, పెట్టుబడి సహాయం, మద్దతు ధర అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది మంచి వర్షాలు, పాడి పంటలతో తెలంగాణ దేశంలో అత్యధిక ఉత్పత్తులు ఎగుమతి చేసే రాష్ట్రంగా ఎదగాలని మంత్రి పొన్నం ఆకాంక్షించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పందిళ్లలో 'ఏరువాక పౌర్ణమి' సందర్భంగా పొలం దున్నే కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఎడ్ల నాగలితో దుక్కి దున్ని విత్తనాలు చల్లారు.

**ఎగుమతి చేసే రాష్ట్రంగా తెలంగాణ..**

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. 'రైతులందరికీ ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు. రైతులకు ప్రభుత్వం తరఫున ఉచిత విద్యుత్, సాగునీరు, పెట్టుబడి సహాయం, మద్దతు ధర అందిస్తున్నాం. రైతులకు ఏ ఇబ్బంది లేకుండా రైతుల సంక్షేమం కోసం కట్టుబడి ఉండే ప్రభుత్వం మాది. ఈసారి దేశంలో అధిక ఉత్పత్తులు ఎగుమతి చేసే రాష్ట్రంగా తెలంగాణ ఎదగాలని ఆకాంక్షిస్తున్నా. విత్తనాలు వేసుకునే శక్తి లేని వారు నా క్యాంపు కార్యాలయాన్ని సంప్రదించండి. మేము విత్తనాలు అందిస్తాం, మీరు ఖాళీ జాగా లేకుండా పంటలు వేయాలి. మొన్ననే హుస్నాబాదులో మూడు రోజుల పాటు రైతు మహోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ ప్రాంత రైతాంగానికి నూతన వ్యవసాయ విధానాలు, పద్ధతులపై మూడు రోజుల కాన్ఫరెన్స్ జరిగింది. పంటలు, యాంత్రీకరణ తదితర అంశాలపై రైతులు అవగాహన చేసుకున్నారు' అని చెప్పారు.

# ప్రభుత్వ బడుల్లోనూ ఎల్‌కేజీ, యూకేజీ

## ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రవేశాలు

కీలక నిర్ణయం తీసుకున్న తెలంగాణ సర్కార్.. డీఈవోలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ

**మహా:** తెలంగాణ సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది.ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లోనూ ఇకపై ప్రీ ప్రైమరీ విద్యను అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతుల నిర్వహణకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచే ప్రవేశాలు కల్పిస్తున్నారు. అయితే, ప్రైవేటు పాఠశాలల్లో మాత్రం మూడేళ్ల వయసు నుంచే నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ వంటి ప్రీ ప్రైమరీ తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్న వయసులోనే పునాది విద్య అందించాలనే ఉద్దేశంతో ప్రైవేటు కాన్వెంట్ల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ పరిణామం ప్రభుత్వ పాఠశాలల్లో ఏటా విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గడానికి ఒక కారణంగా ప్రభుత్వం భావించింది.


**డీఈవోలకు ఆదేశాలు..**

దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో కూడా శిశు విద్యను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం సంకల్పించింది. 202526 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 210 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతుల్లో విద్యార్థులను చేర్చుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారులకు (డీఈవోలకు) స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# కాళేశ్వరం ప్రాజెక్ట్ అధికారి ఇంట్లో ఏసీబీ దాడులు

## ఏకకాలంలో 20 చోట్ల సోదాలు

- కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్న అధికారులు
- కరీంనగర్ నుంచి హైదరాబాద్ కు శ్రీధర్ తరలింపు





**మహా :** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బుధవారం కాళేశ్వరం కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారు. ఇదే సమయంలో రాష్ట్రంలో ఏసీబీ అధికారులు కాళేశ్వరం ప్రాజెక్ట్ అధికారి ఇంట్లో సోదాలు నిర్వహించడం సంచలనంగా మారింది. ఏకకాలంలో 20 చోట్ల సోదాలు నిర్వహించారు. ఇంతకు ఆ అధికారి ఎవరంటే.. ఇరిగేషన్ శాఖలో పనిచేస్తున్న ఈఈ నూనె శ్రీధర్. నూనె శ్రీధర్ గతంలో కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో పని చేశారు. ఇక ఆయన వద్ద ఆదాయానికి మించిన ఆస్తులున్నాయనే ఆరోపణలు రావడంతో.. ఏసీబీ అధికారులు ఆయనపై కేసు నమోదు చేశారు. అంతేకాక నూనె శ్రీధర్‌కు సంబంధించి.. 20 చోట్ల ఒకేసారి ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. ఇవి ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటికే అధికారులు పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం నూనె శ్రీధర్ చొప్పదండిలోని ఎస్ఆర్ఎస్‌పీ క్యాంపు కార్యాలయంలో పని చేస్తున్నారు. దీంతోపాటు ఇరిగేషన్ ఇంజినీర్ల సంఘం అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. శ్రీధర్ నీటి పారుదల శాఖ ప్రాజెక్టుల్లో వందల కోట్ల రూపాయలు కూడబెట్టినట్లుగా ఆయనపై ఆరోపణలు వచ్చాయి. దీంతో అధికారులు ఆయన నివాసంతో పాటు హైదరాబాద్, కరీంనగర్‌లలో మాత్రమే కాక బెంగళూరులో కూడా సోదాలు జరిపారు. హైదరాబాద్‌లోని ఆరు ప్రాంతాల్లో.. అలానే బెంగళూరులోని 4 ప్రాంతాల్లో సోదాలు కొనసాగాయి. దీంతో పాటుగా శ్రీధర్ కుమారుడు, బంధుమిత్రులు, సన్నిహితుల నివాసాలతో పాటు మరో 9 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలు జరిపారు. అంతేకాక ఏసీబీ అధికారులు.. కరీంనగర్‌లో శ్రీధర్‌ని అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌కి తరలించారు. శ్రీధర్ కాళేశ్వరంలో కీలకమైన గాయత్రీ పంప్‌హౌస్ బాధ్యతలను చూసుకున్నారు. కేసీఆర్.. గతంలో ఈ గాయత్రీ పంప్ హౌస్‌లను బాహుబలి మోటార్లుగా వర్ణించారు.

# నేను రాయల్ ఛాలెంజే తాగను.. ఆర్సీబీని కొంటానా?

- డీకే శివకుమార్
- ఆర్సీబీ కొనుగోలు వార్తలను కొట్టిపారేసిన కర్ణాటక డిప్యూటీ సీఎం
- ఐపీఎల్ ఫ్రాంచైజీని కొనే ఉద్దేశం తనకు లేదని స్పష్టీకరణ

**మహా:** ఐపీఎల్ ఫ్రాంచైజీ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)ను తాను కొనుగోలు చేయబోతున్నానంటూ వస్తున్న వార్తలను కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తీవ్రంగా ఖండించారు. ఈ ఊహాగానాల్లో ఎలాంటి వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు. 2025లో ఆర్సీబీ జట్టు తొలిసారిగా ఐపీఎల్ టైటిల్ గెలుచుకున్న తర్వాత ఫ్రాంచైజీ యాజమాన్యం మారబోతోందంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలోనే డీకే శివకుమార్ పేరు కూడా తెరపైకి వచ్చింది. బుధవారం మీడియాతో మాట్లాడిన డీకే శివకుమార్ ఈ వదంతులపై తనదైన శైలిలో స్పందించారు. "నాకు ఆర్సీబీ ఎందుకు? నేను రాయల్ ఛాలెంజ్ (విస్కీ బ్రాండ్ పేరును ప్రస్తావిస్తూ) కూడా తాగను కదా" అని ఆయన చమత్కరించారు. "ఐపీఎల్ ఫ్రాంచైజీని కొనడానికి నేనేమీ పిచ్చివాడిని కాను. నాకు అలాంటి ఆలోచనే లేదు" అని ఆయన తేల్చి చెప్పారు. ఈ వ్యాఖ్యలతో రాజకీయ వర్గాల్లో, క్రికెట్ అభిమానుల్లోనూ జరుగుతున్న చర్చకు ఆయన తెరదించారు. ఆర్సీబీ అమ్మకం వార్తలు కేవలం ఊహాజనితమైనవి అని, ఫ్రాంచైజీని విక్రయించేందుకు ప్రస్తుతం ఎలాంటి చర్చలు జరగడం లేదని యాజమాన్యం కూడా స్పష్టం చేసింది.

# స్కిల్ కేపిటల్ ఆఫ్ ది గ్లోబ్ గా తెలంగాణ

## సెమీ కండక్టర్ల తయారీ, డిజైనింగ్ లో యువతకు శిక్షణ

2030 నాటికి 10వేల మందికి ఇచ్చేందుకు స్ప్రింగ్ సెమీ కండక్టర్స్ అంగీకారం

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి



**మహా:** "స్కిల్ కేపిటల్ ఆఫ్ ది గ్లోబ్ 'గా తెలంగాణను మార్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్న యూకేకు చెందిన సెమీ కండక్టర్ దిగ్గజ సంస్థ ఆర్మ్ హోల్డింగ్స్ సంస్థ ప్రతినిధులతో ఆయన బుధవారం డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో భేటీ అయ్యారు. పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణలో ఉన్న అనుకూలతలు, పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను ఈ సందర్భంగా వివరించారు. 'సెమీ కండక్టర్ల తయారీ, డిజైనింగ్ లో దిగ్గజ సంస్థగా ఉన్న ఆర్మ్ హోల్డింగ్స్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపించడం మా ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం. తెలంగాణ రైజింగ్ లో భాగస్వామ్యయ్యేందుకు ముందుకొచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు. పరిశ్రమ ఏర్పాటులో అన్ని రకాలుగా అండగా ఉంటాం' అని హామీ ఇచ్చారు. 'మాకున్న పెద్ద ఆస్తి యువత. వారిలో ప్రతిభకు కొదువ లేదు. కొంచెం సానబెడితే మెరికల్లా తయారవుతారు. పరిశ్రమలకు అవసరమైన రెడిమేడ్ మానవ వనరులను అందించే బాధ్యతను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా మా ప్రభుత్వం తీసుకుంది' అని వివరించారు. 'సెమీ కండక్టర్ల తయారీ, డిజైనింగ్ లో ఉన్న డిమాండ్ కు అనుగుణంగా తెలంగాణ యువతను తీర్చి దిద్దేందుకు ప్రయత్నం చేస్తున్నాం. ఈ ప్రయాణంలో మీరు కూడా భాగస్వామ్యం కావాలన్నది మా ఆకాంక్ష. 10వేల మంది యువత శిక్షణనిచ్చే బాధ్యతను తీసుకోవాలి' అని సమావేశానికి హాజరైన మలేషియాకు చెందిన దిగ్గజ సంస్థ స్ప్రింగ్ సెమీ కండక్టర్స్ సీఈవో కెన్ కూను కోరారు. 'తెలంగాణను స్కిల్ కేపిటల్ ఆఫ్ ది గ్లోబ్ గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయం. మా వంతుగా ఇక్కడి యువతను సెమీ కండక్టర్ల తయారీ, డిజైనింగ్ లో అత్యుత్తమ మానవ వనరులుగా తీర్చి దిద్దేలా ప్రత్యేక కరిక్యులమ్ ను రూపొందిస్తాం. విద్యా సంస్థల సహకారంతో ఆరు నెలలు ఇక్కడ శిక్షణ... మిగిలిన కాలం తైవాన్, దక్షిణ కొరియా, జపాన్ తదితర దేశాల్లో ఇంటర్న్ షిప్ చేసేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. టీ కన్సల్ట్ సహకారంతో 2030 నాటికి 10వేల మంది యువతకు శిక్షణ ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తాం' అని కెన్ కూ... మంత్రి శ్రీధర్ బాబుకు వివరించారు. సానుకూలంగా స్పందించిన కెన్ కూ మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీ కన్సల్ట్ ఛైర్మన్ సందీప్ కుమార్ మక్తాలా, వరల్డ్ తెలుగు ఐటీ కౌన్సిల్ మలేషియా విభాగం ప్రెసిడెంట్ మారుతీ, ఇతర ప్రతినిధులు మహేష్ నటరాజ్, వాకిటి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం నిర్మాణం అంతా ఇంజనీర్లదే?

(మొదటిపేజీ తరువాయి)



కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ అంశాలు..తీసుకున్న నిర్ణయాలపై పలు డాక్యుమెంట్లు పీసీ ఘోష్ కమీషన్ కు అందించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్ణయం ఎవరు తీసుకున్నారు?, బ్యారేజీలలో నీళ్లను నింపమని మీరు అదేశించారా?..బ్యారేజీల లొకేషన్స్ మార్పు నిర్ణయం ఎవరు తీసుకున్నారు? ఆనకట్టల నిర్మాణానికి కేబినెట్ ఆమోదం ఉందా? కార్పేరేషన్ ఎందుకు ఏర్పాటు చేశారు వంటి ప్రశ్నలను కాళేశ్వరం కమిషన్ సంధించింది. కాళేశ్వరం ప్రాజెక్టుల డిజైన్ల రూపకల్పనలో మీ పాత్ర ఏంటి?.. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు కారణం ఏంటి?..ప్రాజెక్టు పూర్తి కాకముందే బిల్లులు ఎందుకు చెల్లించారు?.. కాళేశ్వరం ప్రాజెక్టును ఎప్పుడు ఆమోదించారు?. మంత్రివర్గ ఉపసంఘం ఎప్పుడు ఏర్పాటైంది?. కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి మంత్రివర్గ ఆమోదం ఉందా? 7. సబ్ కమిటీ సిఫార్సులకు కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధం ఉందా?..మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీల నిర్మాణ వద్ద రాతి పునాది ఉందా?. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీల నిర్మాణ వద్ద రాతి పునాది ఉందా? మేడిగడ్డ ప్రాజెక్టు స్థలాన్ని ఎందుకు మార్చారు? వంటి అంశాలను రెడీ చేసింది. ఈ విషయాలు కాకుండా అధికారులు, మాజీ మంత్రులు ఇచ్చిన ప్రశ్నల ఆధారంగా మరి కొన్ని ప్రశ్నలు రెడీ చేసినట్టు తెలుస్తోంది.

**కేసీఆర్ ఏం చెప్పారంటే..?**

తొలుత కమిషన్ ప్రశ్నలకు మౌనం దాల్చిన కేసీఆర్, ఆ తర్వాత నోరు విప్పినట్లు సమాచారం. కేబినెట్ ఆమోదంతోనే ఆనకట్టల నిర్మాణం జరిగిందని..వ్యాప్కోస్ సిఫారసులు మేరకు నిర్మాణం చేశారని..అన్ని అనుమతులు తీసుకున్నామని కేసీఆర్ వివరించారు. మేడిగడ్డ వద్ద 230 టీఎంసీల నీళ్లను లిఫ్ట్ చేయడానికి అవకాశం ఉంది. అందుకే లోకేషన్ మార్పు అని..ప్రాజెక్టు వేగంగా పూర్తి చేసేందుకు కార్పోరేషన్ ఏర్పాటు చేశామని..బ్యారేజీల నిర్మాణ స్థలం ఎంపిక, మార్పు సాంకేతిక అంశమని..నీటి లభ్యత పరిగణలోకి తీసుకుని కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టామన్నారు. ఎంత నీరు నిల్వ చేయాలన్నది ఇంజనీర్లు చూసుకుంటారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు వివరాలకు సంబంధించిన పుస్తకాన్ని, జీవో నంబర్ 45, ఆపరేషన్స్ అండ్ మెయింటనెన్స్ బుక్ ను కమిషన్ కు అందచేశారు.

# విచారణల పేరిట రాక్షసానందం



(మొదటిపేజీ తరువాయి)

ఈ దేశంలోని సమకాలీన రాజకీయ నాయకులలో ఎవరికి ఉండదు. చివరకు ధర్మం, న్యాయమే గెలుస్తది. తెలంగాణను సాధించిన నాయకుడిగా, సస్యశ్యామలం చేసిన నాయకుడిగా కేసీఆర్ పేరు చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడుతదని కేటీఆర్ అన్నారు.

**చిల్లర గాడికి కేసీఆర్ గొప్పతనం అర్థం కాదు..**

రాజకీయ వేధింపులు, కక్ష సాధింపులు తప్ప ఈ సన్నాసికి ఏం చేతకాదు అని అర్థమైతుందని కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డి కూలగొట్టడానికి వచ్చాడు తప్ప కట్టడానికి రాలేదు. విధ్వంసకరమైన ఆలోచనలతో పేదల ఇండ్లు కూలగొట్టడం, ప్రాజెక్టులను కూలగొట్టడం.. 100 జన్మలు ఎత్తినా రేవంత్ రెడ్డి అనే చిల్లర గాడికి కేసీఆర్ గొప్పతనం అర్థం కాదు. రేవంత్ రెడ్డి గురువు, ఆయన జేజమ్మతో గొడవ పడి ఇక్కడ నుండి తరిమిన వాడే కేసీఆర్. రేవంత్ రెడ్డి అనే చిల్లరగాడు ఏం చేసినా, ఆయన ప్రభుత్వం ఏం చేసినా కేసీఆర్ వెంట్రుక కూడా పీకలేడు. రేవంత్ రెడ్డిని వదిలిపెట్టం.. కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టేదాకా వెంటాడుతాం అని కేటీఆర్ తేల్చిచెప్పారు. ఈ చిల్లర రాజకీయాలను పట్టించుకోవద్దని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా. ఆరు గ్యారెంటీలు, 420 హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉండాలి. రేవంత్ రెడ్డిని ప్రజాక్షేత్రంలో బట్టలిప్పి నిలబెట్టే రోజులు వస్తాయి. రేవంత్ రెడ్డి లాంటి చిల్లర నాయకుడికి కేబినెట్ అంటే అర్థం కాదు.. కేబినెట్ ఎట్ల పని చేస్తదో తెలియదు. రైతుల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలు ముఖ్యం ఆయనకు. విచారణల పేరిట రేవంత్ రాక్షసానందం పొందుతున్నారు. నిజం నిలకడగా తేలుతుంది. కొన్ని రోజులు కాళేశ్వరం అని, ఫోన్ ట్యాపింగ్ అని, ఈ ఫార్ములా అని డ్రామాలు ఆడుతున్నారు. మంత్రి వర్గ విస్తరణ చేయలేని సీఎం.. చివరకు శాఖలు కేటాయించుకోలేని అసమర్థ సీఎం రేవంత్ రెడ్డి అంటూ కామెంట్స్ చేశారు.

# కాళేశ్వరం వల్లే బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పిన..



(మొదటిపేజీ తరువాయి)


తాను బీఆర్ఎస్ పార్టీని వీడేందుకు కాళేశ్వరం కూడా ఓ కారణం అని కొండ విశ్వేశ్వర్ రెడ్డి చెప్పారు.

**అందుకే పార్టీ మారిన..**

'కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణలో వరి ధాన్యం దిగుబడి పెరగలేదు. కాళేశ్వరం పేరుతో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ డిజైన్ అన్ని విధాలుగా తప్పు. మేడిగడ్డను బ్యారేజ్‌గా కాకుండా.. డ్యాంగా వాడుకోవడం వల్లనే దెబ్బతింది. అప్పుడు కాళేశ్వరంపై గొప్పలు చెప్పుకుని.. ఇప్పుడు కేసీఆర్ తప్పించుకుంటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ స్వయం ప్రత్యక్షం అయిందా?. గవర్నర్ కేసీఆర్ గారిని కాళేశ్వర్ రావు అని పిలిచారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రతి రైతు ప్రతి ఏడాది 91 వేలు రూపాయలు లబ్ధి పొందుతున్నారు. బీజేపీ ఎంపీలు వేస్ట్ అని ఆరోపిస్తున్నారు. తెలంగాణను ఆదుకుంటుంది కేంద్రం. నవోదయ స్కూల్స్, టూరిజం నిధులు, పీఎం శ్రీ, పీఎం కుసుమ్ పథకం కింద మిగతా రాష్ట్రాలతో పోల్చుకుంటే.. తెలంగాణకు ఎక్కువ నిధులు వచ్చాయి' అని బీజేపీ ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి చెప్పారు. 'కాళేశ్వరం మంచి అయినా, చెడు అయిన బాధ్యుడు కేసీఆర్. ప్రపంచంలో అతి పెద్ద ఇంజనీరింగ్ బ్లండర్ కాళేశ్వరం. కాళేశ్వరంలో అవినీతి జరిగినా.. కనీసం ప్రాజెక్ట్ కూడా మిగలలేదు. మిగతా ప్రాజెక్టుల్లో అవినీతి జరిగినా.. ప్రాజెక్ట్ మాత్రం మిగిలింది. కేబినెట్ అంటే కేసీఆర్.. కేసీఆర్ అంటే కేబినెట్. కమిషన్ అడిగిన దానికి ఈటల రాజేందర్ సమాధానం చెప్పారు. కేసీఆర్ గురుంచి అడిగి ఉంటే ఈటల చెప్పే వారు. నేను బీఆర్ఎస్ పార్టీని వీడేందుకు కాళేశ్వరం కూడా ఓ కారణం' అని ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి చెప్పుకొచ్చారు.

# రాష్ట్రానికి కేసీఆర్ కుటుంబమే ప్రధాన శత్రువు

## నేను ఉన్నంతవరకూ కాంగ్రెస్‌లోకి వారికి నో ఎంట్రీ.. సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మహా:**

తానున్నంత వరకూ కాంగ్రెస్‌లోకి కేసీఆర్ కుటుంబానికి ఎంట్రీ లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టంగా చెప్పారు. రాష్ట్రానికి కేసీఆర్ కుటుంబమే ప్రధాన శత్రువు అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో జరిగిన మంత్రివర్గ విస్తరణపై ఢిల్లీలో ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. కర్ణాటక కులగణనపై మాత్రమే అధిష్ఠానం వద్ద చర్చలు జరిగాయన్నారు. కాళేశ్వరం గురించి రెండు రోజుల్లో ప్రెస్‌మీట్ పెడతామని తెలిపారు. తెలంగాణకు సంబంధించి కేంద్రంలో అన్నింటికీ అడ్డుపడుతున్నది కిషన్ రెడ్డి అని ఆరోపించారు. ఏ ఒక్క ప్రాజెక్టుకు కిషన్‌రెడ్డి నిధులు సాధించలేదని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపణలు చేశారు. మూడు రోజులు దిల్లీ పర్యటనలో బిజీగా గడిపిన సీఎం రేవంత్ రెడ్డి, హైదరాబాద్ కు తిరుగు ప్రయాణమయ్యారు. ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణనను జనంలోకి తీసుకెళ్లే లక్ష్యంతో రాష్ట్రంలో రెండు బహిరంగసభలు నిర్వహించాలని ముఖ్యమంత్రి అధిష్ఠానానికి వివరించినట్లు సమాచారం. ఈ సభలకు రావాలని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీకి ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# రాజీవ్ యువ వికాసం

## భారీగా దరఖాస్తుల తిరస్కరణ.. వచ్చినవి 16 లక్షలు..తిరస్కరణకు గురైనవి 6.6 లక్షలు




**మహా :** రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఎంతో ఆశతో చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం అమలులో ఊహించని జాప్యం, సవాళ్లు ఎదురవుతున్నాయి. యువతకు ఆర్థిక సహాయం అందించి.. వారిని ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయాలన్న లక్ష్యంతో మొదలుపెట్టిన ఈ పథకం కింద లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో తీవ్ర అడ్డంకులు తలెత్తుతున్నాయి. ఇటీవల వెల్లడైన సమాచారం ప్రకారం.. ఈ పథకానికి వచ్చిన 16 లక్షలకు పైగా దరఖాస్తుల్లో సుమారు 6.6 లక్షల దరఖాస్తులు వివిధ కారణాలతో తిరస్కరించబడటం రాష్ట్రంలోని నిరుద్యోగ యువతలో తీవ్ర నిరాశను, ఆందోళనను నింపింది.

**అయోమయంలో యువత**

రాజీవ్ యువ వికాసం పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు జూన్ 2, 2025 నాటికి మంజూరు పత్రాలు అందజేస్తామని ప్రభుత్వం తొలుత ప్రకటించింది. అయితే ఊహించని అడ్డంకులు, క్షేత్రస్థాయి సమస్యల కారణంగా ఈ పంపిణీ ప్రక్రియ వాయిదా పడింది. ఈ ఆలస్యం పథకం కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది దరఖాస్తుదారుల్లో అయోమయాన్ని, భవిష్యత్తుపై ఆందోళనను రేకెత్తించింది. జూన్ 5న జరిగిన తెలంగాణ కేబినెట్ సమావేశంలో ఈ పథకం అమలు తీరుపై విస్తృతంగా చర్చ జరిగినప్పటికీ.. ఇప్పటి వరకు దీనిపై స్పష్టమైన నిర్ణయం వెలువడలేదు. ఇది యువత ఆశలను మరింత సన్నగిల్లజేస్తోంది.

**తిరస్కరణలకు ప్రధాన కారణాలు**

రాజీవ్ యువ వికాసం పథకానికి రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ వర్గాల నుంచి మొత్తం 16,23,643 దరఖాస్తులు అందాయి. వీటిని అధికారులు నిశితంగా పరిశీలించగా, అనర్హతలు, బ్యాంకర్లు అనుసరించిన సిబిల్ స్కోరు ప్రమాణాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఇతర సమస్యల కారణంగా భారీ సంఖ్యలో అనగా సుమారు 6,60,332 దరఖాస్తులు తిరస్కరించబడ్డాయి. ముఖ్యంగా.. ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న యువతలో చాలామందికి సిబిల్ స్కోరు అడ్డంకిగా మారుతోంది. గతంలో తీసుకున్న చిన్నపాటి రుణాలు, వాటి ఆలస్య చెల్లింపులు, లేదా సరైన ఆర్థిక క్రమశిక్షణ లేకపోవడం వల్ల ఏర్పడిన తక్కువ సిబిల్ స్కోరు ఈ తిరస్కరణలకు ప్రధాన కారణం. ఆర్థిక సంక్షోభాల వల్ల గతంలో జరిగిన చిన్నపాటి పొరపాట్లు వారికి ఇప్పుడు అడ్డంకిగా మారాయి. ఆర్థిక అక్షరాస్యత లేకపోవడం కూడా ఈ సమస్యను మరింత జటిలం చేస్తుంది. ప్రభుత్వం యువతకు ఆర్థిక సహాయం అందించడానికి పూనుకున్నప్పటికీ.. సాంప్రదాయిక బ్యాంకింగ్ ప్రమాణాలు వారి కలలకు అడ్డుపడుతున్నాయని నిరుద్యోగ వర్గాలు వాపోతున్నాయి.

**ప్రభుత్వానికి సవాళ్లు**

ఈ పథకం కోసం ఎన్నో ఆశలతో దరఖాస్తు చేసుకున్న యువతకు.. భారీ సంఖ్యలో దరఖాస్తుల తిరస్కరణ తీవ్ర నిరాశను కలిగించింది. ఒకవైపు ఉపాధి అవకాశాలు పరిమితంగా ఉండగా, మరోవైపు ప్రభుత్వ పథకం ద్వారా ఆశించిన సహాయం లభించకపోవడం వారిని మరింత కుంగదీస్తోంది. సిబిల్ స్కోరు, అనర్హతలు, బ్యాంకు లావాదేవీల సమస్యలను అధిగమించి అర్హులైన యువతకు త్వరగా ఆర్థిక సహాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్ని వర్గాల నుంచి డిమాండ్లు వినిపిస్తున్నాయి.

# అనుమతి తీసుకోలేదు, అతి ప్రచారం చేశారు

## తొక్కిసలాట ఘటనలో ఆర్సీబీదే తప్పు




- బెంగళూరు తొక్కిసలాట ఘటనపై హైకోర్టులో విచారణ
- ఆర్సీబీ, బీసీసీఐపై కర్ణాటక ప్రభుత్వ తీవ్ర ఆరోపణలు
- విక్టరీ పరేడ్‌కు అనుమతులు తీసుకోలేదని వెల్లడి
- సామాజిక మాధ్యమాల్లో అతి ప్రచారమే దుర్ఘటనకు కారణమని ఆరోపణ
- భద్రతా ఏర్పాట్ల వైఫల్యం, బీసీసీఐదే బాధ్యత అని ప్రభుత్వ వాదన

**మహా :** ఐపీఎల్ విజేతగా నిలిచిన ఆర్సీబీ జట్టు విజయోత్సవ ర్యాలీ సందర్భంగా చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై కర్ణాటక హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా కర్ణాటక ప్రభుత్వం ఆర్సీబీ యాజమాన్యం పైనా, బీసీసీఐ పైనా తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించింది. విజయోత్సవ కార్యక్రమానికి నిర్వాహకులు ఎలాంటి ముందస్తు అనుమతులు పొందలేదని, కేవలం సమాచారం మాత్రమే ఇచ్చారని ప్రభుత్వం కోర్టుకు నివేదించింది. అంతేకాకుండా, ఆర్సీబీ జట్టు తమ సామాజిక మాధ్యమ ఖాతాల ద్వారా ఈవెంట్‌కు విపరీతమైన ప్రచారం కల్పించడం వల్లే ఈ విషాదం చోటుచేసుకుందని ప్రభుత్వం వాదించింది.

ఈ తొక్కిసలాట ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి, ఆర్సీబీ మార్కెటింగ్ హెడ్ నిఖిల్ సోసలేతో పాటు మరో ముగ్గురిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తమ అరెస్టును సవాలు చేస్తూ వారు కర్ణాటక హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు సింగిల్ జడ్జి ధర్మాసనం ముందు కర్ణాటక ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ శశికిరణ్ శెట్టి తమ వాదనలు వినిపించారు. విజయోత్సవ ర్యాలీ నిర్వహణ కోసం వారు ముందుగా ఎటువంటి అనుమతులు తీసుకోలేదు. కేవలం ప్రభుత్వానికి సమాచారం మాత్రమే అందించారు. జూన్ 3వ తేదీన ఫైనల్ మ్యాచ్ జరగడానికి కేవలం గంట ముందు కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం నుంచి ఒక లేఖ అందింది. అందులో పరేడ్‌కు అనుమతి ఇవ్వాలన్న అభ్యర్థన ఏమీ లేదు. కేవలం ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మాత్రమే తెలిపారు. ఇది పూర్తిగా చట్టవిరుద్ధమని అడ్వొకేట్ జనరల్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

అంతేకాకుండా, "ఈ విక్టరీ పరేడ్ గురించి ఆర్సీబీ జట్టు అర్ధరాత్రి నుంచే సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసింది. టికెట్లు లేదా ప్రవేశానికి సంబంధించిన సరైన సమాచారం ఇవ్వకుండానే అభిమానులందరూ పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చింది. దీని ఫలితంగానే సుమారు 3.5 లక్షల నుంచి 4 లక్షల మంది అభిమానులు స్టేడియం గేట్ల వద్దకు పోటెత్తారు" అని ప్రభుత్వ తరపు న్యాయవాది వివరించారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నట్లుగా ప్రచారం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, కానీ ఇది పూర్తిగా ఆర్సీబీ నిర్వహించిన ప్రైవేటు ఈవెంట్ అని ప్రభుత్వం స్పష్టం చేసింది. "మైదానం వద్ద భద్రత, గేట్ల నిర్వహణ, టికెట్ల జారీ వంటి అంశాలకు సంబంధించి ఆర్సీబీ మరియు బీసీసీఐ మధ్య ఒప్పందం ఉంది. కాబట్టి, ఈ ఘటనకు బీసీసీఐ కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఈవెంట్ సమయంలో కనీస ఏర్పాట్లు కూడా సరిగా లేవు. సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు" అని కర్ణాటక ప్రభుత్వం కోర్టులో ఆరోపించింది.

# ఓఎంసీ కేసులో గాలి జనార్ధన్ రెడ్డికి భారీ ఊరట

## సీబీఐ కోర్టు జైలు శిక్ష విధింపు

### షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు



**మహా :** కర్ణాటకకు చెందిన కల్యాణ రాజ్య ప్రగతి పక్ష శాసన సభ్యుడు, మాజీ మంత్రి గాలి జనార్ధన్ రెడ్డికి భారీ ఊరట దక్కింది. సంచలన సృష్టించిన ఓబుళాపురం మైనింగ్ అక్రమ తవ్వకాల వ్యవహారంలో ఏడు సంవత్సరాల కారాగార శిక్ష పడిన ఆయనకు బెయిల్ లభించింది. ఓబుళాపురం గనుల్లో అక్రమ తవ్వకాల వ్యవహారంలో హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం గాలి జనార్ధన్ రెడ్డికి ఏడు సంవత్సరాల కారాగార శిక్ష విధించిన విషయం తెలిసిందే. ఇదే కేసును ఎదుర్కొన్న తెలంగాణకు చెందిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఏపీకి చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారిణి వై శ్రీలక్ష్మిని నిర్దోషులుగా తేల్చింది. ఇదే కేసులో గాలి జనార్ధన్ రెడ్డిని దోషిగా తేలారు. ఆయనకు ఏడేళ్ల జైలు శిక్షను విధించింది సీబీఐ స్పెషల్ కోర్టు. ఆయనతో పాటు ఓబుళాపురం మైనింగ్ కంపెనీ డైరెక్టర్ బీవీ శ్రీనివాస రెడ్డికీ ఏడు సంవత్సరాల కారాగార శిక్ష పడింది. దీనిపై గాలి జనార్ధన్ రెడ్డి.. బెయిల్ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. బెయిల్ మంజూరు చేయాలంటూ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటీషన్ ను తెలంగాణ హైకోర్టు విచారణకు స్వీకరించింది. తాజాగా ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఎటువంటి పరిస్థితుల్లోనూ దేశం విడిచి వెళ్లిపోకూడదని హైకోర్టు ఆదేశించింది. పాస్ పోర్టును సరెండర్ చేయాలని సూచించింది. అలాగే 10 లక్షల రూపాయల విలువ గల ష్యూరిటీని అందజేయాలని గాలి జనార్ధన్ రెడ్డికి తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. ఓబుళాపురం మైనింగ్ అక్రమ తవ్వకాల వ్యవహారం ఆయనకు రాజకీయంగా కూడా చిక్కులను తెచ్చిపెట్టిన విషయం తెలిసిందే. క్రియాశీలక రాజకీయాలకు శాశ్వతంగా దూరం అయ్యేలా చేసింది. కర్ణాటక అసెంబ్లీ ఆయనపై అనర్హత వేటు వేసింది. ఇది వరకే అసెంబ్లీ కార్యదర్శి ఎంకే విశాలాక్షి నోటిఫికేషన్ జారీ చేశారు. గాలి జనార్ధన్ రెడ్డి.. కొప్పళ జిల్లాలోని గంగావతి అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యాన్ని వహించారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తన సొంత పార్టీ కల్యాణ రాజ్య ప్రగతి పక్ష తరపున పోటీ చేశారు. దాదాపు 8,000 ఓట్ల మెజారిటీతో తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్‌కు చెందిన ఇక్బాల్ అన్సారీని ఓడించారు. 2022లో కేఆర్పీపీ పార్టీని స్థాపించారు గాలి. ఆ తరువాత దీన్ని భారతీయ జనతా పార్టీలో విలీనం చేశారు. మైనింగ్ కుంభకోణంలో జైలు శిక్ష అనుభవించడానికి ముందు ఆయన యడియూరప్ప ప్రభుత్వంలో కర్ణాటక పర్యాటక శాఖ మంత్రిగా పని చేశారు. 2015 నుండి బెయిల్‌పై ఉన్న ఆయన బీజేపీకి దూరంగా ఉంటూ వచ్చారు. సొంత పార్టీని నెలకొల్పారు. అక్రమ మైనింగ్ కేసులో గాలి జనార్ధన్ రెడ్డిని సీబీఐ కోర్టు దోషిగా తేల్చిన నేపథ్యంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 191 (1) (ఈ), 1951 ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 8 ఆధారంగా ఆయనపై ఆరు సంవత్సరాల పాటు అనర్హత వేటు వేసినట్లు నోటిఫికేషన్ పేర్కొంది. ఫలితంగా గంగావతి అసెంబ్లీ స్థానం ఖాళీ అయింది.



### కేబినెట్ విస్తరణపై స్పందించిన

# రాజగోపాల్ రెడ్డి

## పదవున్నా.. లేకున్నా ప్రజల కోసమే

### నూతన మంత్రులకు శుభాకాంక్షలు

**హైదరాబాద్, మహా:** కేబినెట్ విస్తరణపై ఎట్టకేలకు మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి స్పందించారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ఖాతాలో ఓ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాజ్‌గోపాల్ రెడ్డి మంత్రివర్గ విస్తరణ జరిగితే మొదటగా తనకే పదవి దక్కుతుందని ఆశాబావం వ్యక్తం చేశారు. కానీ ఆయన అంచనాలకు విరుద్ధంగా సామాజిక సమీకరణల లెక్కల్లో కాంగ్రెస్ పార్టీ ఆయనకు మంత్రి పదవి ఇవ్వలేదు. దీంతో కొన్ని రోజులుగా ఆ పార్టీ పెద్దలకు టచ్‌లోకి రాలేదు. బుధవారం ఆయన అలకవీడారు. మంత్రి పదవిలో ఉన్నా లేకున్నా పార్టీని బలపరిచే ప్రయత్నాల్లో, ప్రజల మద్దతుతో ముందుకు సాగుతాని ఆయన సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. కోమటి రెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సోషల్ మీడియాలో ఇలా రాసుకొచ్చారు. తెలంగాణ కేబినెట్‌లో నూతనంగా నియమితులైన మంత్రులను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాని పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేయడంలో వారికి సంపూర్ణ విజయం కోరుకుంటున్నాను. తన వరకూ రాజకీయాలు అంటే పదవులు, అధికారాలు కాదని స్పష్టం చేశారు రాజ్ గోపాల్ రెడ్డి. ప్రజల పట్ల నా నిబద్ధత, తెలంగాణ పునర్నిర్మాణం పట్ల నా కలలే నాకు ప్రేరణగా నిలిచాయి. అదే కారణంగా నేనే తిరిగి కాంగ్రెస్ పార్టీకి వచ్చానని మునుగోడు ఎమ్మెల్యే అన్నారు. ప్రజల సమస్యలు వినడంలో, వారి హక్కుల కోసం పోరాడడంలో, వారి గొంతుకను ప్రభుత్వం వరకు తీసుకెళ్లడంలో నేను ఎప్పటికీ ముందుంటాను. నా రాజకీయ ప్రయాణం ఇక్కడితో ఆగదు. కొన్నిసార్లు, పదవి లేకుండానే ప్రజల మధ్య పనిచేసే అవకాశం ఎంతో శక్తివంతంగా మారుతుంది.

# ఇందిరమ్మ ఇండ్లకు ఉచితంగా ఇసుక

## కలెక్టర్లకే ఇసుక కూపన్ల పంపిణీ బాధ్యత

### ములుగు ప్రాంతానికి మరో వెయ్యి ఇందిరమ్మ ఇండ్లు

### రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆశీర్వదించండి

### రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**మహా :** రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించి లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తామని, ఉచిత ఇసుక కూపన్ల పంపిణీ బాధ్యతను జిల్లా కలెక్టర్లను అప్పగిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ములుగు జిల్లా ములుగు మండలంలోని ఇంచెర్ల గ్రామంలో న రాష్ట్ర పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కతో కలిసి బుధవారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ములుగు నియోజకవర్గానికి 3,500 ఇండ్లతో పాటు ఐటీడీఏ పరిధి దృష్ట్యా మరో 1500 ఇండ్లు మంజూరు చేశామన్నారు. అయితే మంత్రి సీతక్క అభ్యర్థన మేరకు మరో 1000 ఇందిరమ్మ ఇండ్లను ప్రత్యేకంగా మంజూరు చేస్తున్నామని ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. లబ్ధిదారులు మరో 1015 రోజుల్లో ఇండ్ల నిర్మాణం ప్రారంభిస్తే ప్రతి సోమవారం వారికి నిధులను విడుదల చేస్తామన్నారు. అదే విధంగా ఈ ప్రాంతంలోని అటవీ భూములలో ఇంతవరకు చిన్నపాటి ఇంటిని కలిగి అందులో నివసిస్తున్న ప్రజలకు అక్కడే ఇందిరమ్మ ఇళ్లు కట్టుకునే అవకాశం కల్పించాలంటూ అటవీ అధికారులను ఆదేశిస్తామని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో చెంచులకు ప్రత్యేకంగా 10 వేల ఇండ్లు కూడా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు మంజూరు చేశామని చెప్పారు.

ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే ఇందిరమ్మ ఇండ్లు అని అర్థమని గతంలో 9 సంవత్సరాల పాలనా కాలంలో ఇందిరమ్మ ప్రభుత్వం పేదలకు 25.50 లక్షల ఇండ్లు ఇచ్చిందని మంత్రి గుర్తు చేశారు. తర్వాత వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు దఫాలు రాజ్యమేలినా కేవలం 92 వేల ఇండ్లకు ఆమోదం తెలిపి 60 వేల ఇండ్లను మాత్రమే పూర్తి చేసిందని, 30 వేలకు పైగా ఇండ్లు మొండి గోడలతో మిగిలి పోయాయని మంత్రి ఎద్దేవా చేశారు. కట్టిన ఇండ్లకు గాను కాంట్రాక్టర్లకు కూడా డబ్బు చెల్లించలేదన్నారు. ప్రస్తుత ఇందిరమ్మ ప్రభుత్వం ఆ బిల్లులను చెల్లిస్తూనే, గత ప్రభుత్వం చేసిన అప్పులకు గాను నెలకు 6500 కోట్ల రూపాయిలు మిత్తీగా కడుతూనే భారీగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంకల్పించిందని వెల్లడించారు.

ప్రస్తుతం ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం కనీసం 60 మంది వరకు అర్హులైనవారున్నారని, ఇప్పుడు ఒక్కో గ్రామానికి 25 ఇండ్లు మాత్రమే ఇచ్చే వీలుందని భవిష్యత్తులో అన్ని గ్రామాలలోని అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు తప్పక వస్తాయని మంత్రి భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో 22,500 కోట్ల రూపాయిలతో నాలుగేళ్ళలో 20 లక్షల ఇండ్ల నిర్మాణానికి సంకల్పించామని అన్నారు. గత ప్రభుత్వం ప్రజల సొమ్మును సొంత షోకుల కోసం ఖర్చుచేస్తే నేటి ఇందిరమ్మ ప్రభుత్వం పైసా పైసా కూడబెట్టి ఇందిరమ్మ ఇండ్ల కోసం ఖర్చు చేస్తోందని అన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గమనించి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలవాలని మంత్రి పొంగులేటి కోరారు. భూభారతికి సంబంధించి గత ప్రభుత్వ హయాంలో రైతులు అధికారుల చుట్టూ తిరిగినా వారి భూ సమస్యలు పరిష్కారం కాలేదని, ఇప్పుడు రెవెన్యూ అధికారులే ప్రజల వద్దకు వస్తున్నారని మంత్రి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ నాయిక్, ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



### కిషన్ రెడ్డిపై మోదీకి ఫిర్యాదు

# చెయ్యొచ్చు కదా?

- ఆయన నిజంగానే రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారా?
- ఢిల్లీలో విమర్శలు ఎందుకు.. మొన్న మీరు ఓ సభలో కలిసినప్పుడు అడగొద్దా?
- సీఎం రేవంత్ కామెంట్స్‌పై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్

**మహా:** గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి సంచలన కామెంట్స్ చేశారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన ప్రాజెక్టులను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలపై గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పందిస్తూ.. రాష్ట్రంలో ఉన్నప్పుడు ఏమీ మాట్లాడకుండా, ఢిల్లీ వెళ్లిన తర్వాత కిషన్ రెడ్డిపై రేవంత్ రెడ్డి మండిపడతారని అన్నారు. కొన్ని రోజుల క్రితం కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి ఒకే సభా కార్యక్రమంలో పాల్గొన్నారని, అప్పుడు కిషన్ రెడ్డిని కలిసినప్పుడు రేవంత్ రెడ్డి ఈ విషయంపై ఎందుకు అడగలేదు?" అని నిలదీశారు. ఒకవేళ కిషన్ రెడ్డి నిజంగానే రాష్ట్రానికి అన్యాయం చేస్తుంటే, ఆ విషయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేయవచ్చు కదా అని కూడా ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యానించారు.

# హీరో రవితేజకు షాక్!

## ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని మాంగళ్య షాపింగ్ మాల్ సీజ్

### భవనానికి ఆక్యుపేన్సి సర్టిఫికెట్ లేకుండా నిర్వహణ

### ఐదో అంతస్తులో ఏఆర్ టీ స్క్రీన్ ఏర్పాటు చేసేందుకు రవితేజ సన్నాహాలు




**మహా:** టాలీవుడ్ హీరో మాస్ మహారాజా రవితేజకు షాక్ తగిలింది. హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో నిర్మాణంలో ఉన్న ఓ కమర్షియల్ బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన మాంగల్య షాపింగ్ మాల్ ను జీహెచ్ఎంసీ అధికారులు సీజ్ చేశారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేకుండానే షాపింగ్ మాల్ ప్రారంభించడంతో అధికారులు చర్యలు తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇక ఈ బిల్డింగ్ 3 సెల్లార్స్ , గ్రౌండ్ ఫ్లోర్ కాకుండా 5 ఫ్లోర్స్ లలో నిర్మిస్తున్న కమర్షియల్ మరియు మల్టిప్లెక్స్ భవనంగా నిర్మితమవుతుంది. ఇదే భవనంలో 4, 5 అంతస్తులలో ఏఆర్ టీ 7 స్క్రీన్ సినిమా హాల్ కూడా ఏర్పాటు చేయబోతున్నట్టు సమాచారం. ఇలా ఈ భవనంలో నాలుగు ఐదు అంతస్తులలో ఈ ఏషియన్ రవితేజ (ఏఆర్ టీ ) సినిమాస్ తో స్క్రీన్ ఏర్పాటు చేయబోతున్నట్లు కూడా తెలుస్తుంది. ఇలా ఈ మాల్ సీజ్ చేయటంతో రవితేజకు కూడా ఊహించని షాక్ తగిలిందని చెప్పాలి. ఈ బిల్డింగ్ నిర్మాణం పూర్తి కాకుండానే ఈ బిల్డింగ్లో షాపింగ్ మాల్స్ నిర్వహిస్తున్నారు. అయితే ఇదంతా కూడా ఒక బడా బిల్డర్ నిర్వహణతోనే జరుగుతోందని తెలుస్తోంది.

# ఏపీకి 24 లక్షల ఇండ్లిచ్చాం

- రైల్వే బడ్జెట్‌లో ఏపీకి పెద్దపీట వేశాం
- డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లే అభివృద్ధి
- కేంద్ర మంత్రి బండి సంజయ్

**మహా:** ఎన్డీయే ప్రభుత్వ హయాంలోనే ఏపీకి 24 లక్షల ఇళ్లను మంజూరు చేశామని కేంద్ర మంత్రి బండి సంజయ్ వెల్లడించారు. దేశమంతా ప్రధాని మోడీ నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ సర్కార్‌ను కోరుకుంటోందని, ఈ డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లే ఏపీలో అభివృద్ధి మెరుపు వేగంతో జరుగుతోందని బండి సంజయ్ అన్నారు. బుధవారం తిరుపతిలో కేంద్రమంత్రి బండి సంజయ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... మోదీ 11 ఏళ్ల పాలన విశేషాలను వివరించారు. ఇప్పటికే ఏపీకి 8 కేంద్రీయ విద్యాలయాలను కేంద్రం ఇచ్చిందని, రాష్ట్రంలో ఇప్పటి వరకు 4,741 కి.మీ హైవేలను నిర్మించామని వెల్లడించారు. పలు ఎయిర్‌పోర్టులను మరింత ఆధునీకరిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే రైల్వే బడ్జెట్‌లో ఏపీకి పెద్దపీట వేశామని, అమృత్ మహోత్సవంలో భాగంగా.. రాష్ట్రంలోని అనేక రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

# డబ్బులిచ్చి వ్యూస్ కొనడం ఇకపై ఆపేస్తా

## దిల్ రాజు సంచలన ప్రకటన



**మహా:** ప్రముఖ నిర్మాత దిల్ రాజు తెలుగు సినిమా పరిశ్రమలో నెలకొన్న కొన్ని విధానాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా, సినిమాల ప్రచారంలో యూట్యూబ్ వ్యూస్‌ను కృత్రిమంగా పెంచుకునే పద్ధతిపై ఆయన తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇకపై తమ బ్యానర్‌లో నిర్మించే సినిమాలకు డబ్బులు చ్చించి ఫేక్ యూట్యూబ్ వ్యూస్‌ను కొనేది లేదని ఆయన స్పష్టం చేశారు. నితిన్ హీరోగా నటిస్తున్న "తమ్ముడు" సినిమా నుంచే ఈ కొత్త విధానాన్ని అమలు చేస్తున్నట్లు దిల్ రాజు ప్రకటించారు. ఈ విషయంపై ఆయన మాట్లాడుతూ, "మా సినిమా ట్రైలర్ లేదా పాట ఎంత మందికి వాస్తవంగా చేరుతుందో తెలుసుకోవాలనేది నా ఉద్దేశం. లక్షలు, కోట్లు ఖర్చు పెట్టి వ్యూస్ కొంటే అక్కడ నెంబర్ కనిపిస్తుంది కానీ, అది నిజమైన ప్రేక్షకాదరణ కాదు. కంటెంట్ ప్రేక్షకులకు ఎంతవరకు రీచ్ అయిందో అర్థం కాదు. అందుకే, నా పీఆర్ టీమ్‌కు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాను. ఇకపై మన సినిమాలకు వ్యూస్ కొనవద్దు అని చెప్పాను. 'తమ్ముడు' సినిమాతో ఈ పద్ధతిని ప్రారంభిస్తున్నాం," అని తెలిపారు. విషయం ఉంటే ప్రేక్షకులు సినిమాను ఖచ్చితంగా ఆదరిస్తారని ఆయన నొక్కి చెప్పారు. "సంక్రాంతికి వస్తున్నాం" సినిమా విజయాన్ని ఉదాహరణగా చూపుతూ, మంచి కంటెంట్ అందిస్తే ప్రేక్షకులు ఆదరిస్తారనడానికి అదే నిదర్శనమన్నారు. "సినిమాలో విషయం ఉంటే 100% ప్రేక్షకులు చూస్తారు. లేకపోతే తిరస్కరిస్తారు. మన కంటెంట్ ఎంత రీచ్ అవుతుందో తెలిసినప్పుడే, ఎక్కడ లోపం ఉందో అర్థం చేసుకుని దాన్ని సరిదిద్దుకోవడానికి అవకాశం ఉంటుంది," అని దిల్ రాజు వివరించారు. ఇలాంటి ఫేక్ వ్యూస్ వ్యవహారాలపై మీడియా కూడా దృష్టి సారించి, బాధ్యులైన వారిని ప్రశ్నించాలని ఆయన సూచించారు. "మీడియా మిత్రులు ఇలాంటి విషయాలపై ఎందుకు ప్రశ్నించరో నాకు అర్థం కాదు. ఫాల్స్ ప్రమోషన్లను ఆపడానికి ప్రయత్నిస్తేనే ఇండస్ట్రీలో ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొంటుంది," అని ఆయన అభిప్రాయపడ్డారు. తెలుగు సినిమా పరిశ్రమ దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉందని, ఆ స్థానాన్ని కాపాడుకోవాలంటే అందరూ కలిసికట్టుగా మంచి కంటెంట్‌ను అందించాలని ఆయన పిలుపునిచ్చారు.

# అమెరికా, చైనా మధ్య కీలక ఒప్పందం

## ట్రంప్ సంచలన ప్రకటన

**మహా:** అమెరికా, చైనా మధ్య టారిఫ్ వార్ నెలకొన్న నేపథ్యంలో రెండు దేశాల మధ్య కీలక ఒప్పందం జరిగింది. చైనా.. వాణిజ్య ఒప్పందంలో భాగంగా అమెరికాకు అరుదైన ఖనిజాలను ఎగుమతి చేసేందుకు ఒప్పుకుందని పేర్కొన్నారు. అలాగే తాము కూడా చైనా విద్యార్థులకు వీసాలు జారీ చేస్తామని తెలిపారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పోస్ట్ చేశారు. 'మేము చేసుకున్న ఒప్పందం చైనాతో పూర్తయింది. ఫుల్ మ్యాగ్నెట్స్‌తో పాటు అవసరమైన అరుదైన ఖనిజాలు అమెరికాకు ఎగుమతి చేసేందుకు చైనా అంగీకరించింది. అమెరికా కాలేజీలు, యూనివర్సిటీల్లో చైనా విద్యార్థులు చదువుకునేందుకు మేము కూడా ఒప్పుకున్నామని'' ట్రంప్ తెలిపారు. ఈ డీల్‌కు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆమోదమే మిగిలి ఉందన్నారు. అలాగే తమ వాణిజ్యానికి చైనాకు తలుపులు తెరిచేందుకు జిన్‌పింగ్, తాను కలిసి పనిచేస్తున్నామని చెప్పారు. ఇరుదేశాలకు ఇది గొప్ప విజయమవుతుందని పేర్కొన్నారు. మరోవైపు అమెరికా, చైనా మధ్య టారిఫ్ వార్ నెలకొన్న నేపథ్యంలో అరుదైన ఖనిజాల ఎగుమతిని చైనా నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఆటోమోటివ్స్, డిఫెన్స్ రంగాలకు ఇవే కీలక పాత్ర పోషిస్తాయి. ట్రంప్ ముందుగా చైనాతో సహా అన్ని దేశాలపై భారీగా టారిఫ్‌లు విధించిన సంగతి తెలిసిందే.











# నాడు ఎన్టీఆర్.. నేడు కేసీఆర్..

## బీఆర్కే భవన్ లో సేమ్ సీన్ రిపీట్

**మహా:** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారు. గతంలో మాజీ సీఎం హోదాలో ఎన్టీఆర్ కూడా ఈ భవన్‌లో విచారణకు వెళ్లారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఓ హత్యాయత్నం విచారణ కోసం ఎన్టీఆర్ ని జస్టిస్ రాములు కమిషన్ ఆయన్ని ప్రశ్నించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఓ హత్యాయత్నం విచారణ కోసం నందమూరి తారక రామారావు కు నోటీసులిచ్చి ఈ బీఆర్ కె భవన్‌కు పిలిచింది. జస్టిస్ రాములు కమిషన్ ఆయన్ని ప్రశ్నించింది. మాజీ ముఖ్యమంత్రి హోదాలో బిఆర్ కె భవన్ లో విచారణ ఎదుర్కొన్న రెండో వ్యక్తిగా కేసీఆర్ నిలిచారు.

రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
74369
39999

# జలగం వెంగళరావు.. ఒక సంచలనం

## తెలుగు రాజకీయాలపై తిరుగులేని ముద్ర

వ్యాపార రంగంలో అడుగుపెట్టినా..... పెరిగింది రాజకీయ రణరంగంలో....... ఓటములు ఎదురైనా వెనకడుగు వేయలేదు. కష్టాలు కన్నీళ్ళు అవమానాలు ఎదురైనా ప్రజాస్వామ్యంలో ప్రజల అభిమానంతో కార్యకర్తల కష్టంతో, నాయకుల కృషితో, స్వయం నిర్ణయాలతో అధిరోహించిన శిఖరాలు ఎన్నో....... ప్రజా సమస్యల పరిష్కారంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధిలో అధికారుల సహకారంతో ప్రజల హృదయాలలో గుర్తుండే విధంగా చారిత్రాత్మక సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు, నీటి ప్రాజెక్టులు, పరిశ్రమల స్థాపన, ఉద్యోగుల సమస్యల పరిష్కారం ఎన్నో ఎన్నెన్నో అమలు చేసిన చిరస్మరణీయుడు ఆయనే మన జలగం వెంగళరావు గారు . వారి 27 వ వర్ధంతి సందర్భంగా నాటి తరం పట్టుదలతో పనిచేయడం, సేవా దృక్పథం నేటి తరానికి అందిస్తున్న మహానీయుని చరిత్ర.

శ్రీ కాకుళం జిల్లా రాజం దగ్గర సోపేరులో 1922 మే 4వ తేదీన మాతా మహుల ఇంట శ్రీ జలగం వెంగళరావు జన్మించినారు. తండ్రి గారు కృష్ణాజిల్లాలో జమీందారి ఉద్యోగం చేస్తుండేవాడు. శ్రీ జలగం వెంగళరావు కు జలగం రామారావు, కొండలరావులు సోదరులు కాగా దామెర ప్రకాశమ్మ, కోటగిరి సత్యావతమ్మ, చెలికాని తాయారమ్మ లు సోదరీమణులు. తండ్రి ఉద్యోగం చేస్తున్న కేసర పల్లిలో బాల్యం గడవడంతోపాటు ప్రైమరీ విద్యను పూర్తి చేసి ఆ తదుపరి గన్నవరం తాలూకా హైస్కూల్ నందు ఎస్ఎస్ఎల్సి వరకు చదివి ఉత్తీర్ణులయ్యారు. ఈ కాలంలో భావి జీవితానికి మంచి పునాదులు పడ్డాయి. బ్రిటీష్ వారితో తలపడి దేశానికి స్వాతంత్ర్యం సాధించుకోవడం అంత తేలికైన పనికాదు. మహాత్మాగాంధీ, నెహ్రూ, సుభాష్చంద్రబోస్, టంగుటూరి ప్రకాశం పంతులు, భోగరాజు పట్టా భిసీతారామయ్య వంటి నాయకుల పోరాటంలో దండుగా కదిలి పోరు చేస్తున్న ప్రజలపై లాఠీలు నాట్యం చేస్తున్నాయి. తుపాకీ గుండ్లు గుండెల్లో దిగుతున్నాయి. లక్షలాది మంది ప్రజలు దేశవ్యాపితంగా చెరసాలలో మగ్గుతున్నాయి. ఈ విషయాలు అన్ని విజయవాడ కేంద్రంగా పత్రికలలో పుస్తకాలలో వస్తున్న వార్తలతో పాటు ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినాదం వెంగళరావును బాగా ఉద్యమం వైపు ఆకర్షించాయి. ఈ క్రమంలో పరిస్థితులు ఇలా ఉండగా కృష్ణా జిల్లా మాధవరానికి చెందిన వెలుగులేటి మాధవరావు గారి కుమార్తె మంగాయమ్మతో వెంగళరావుకు వివాహం జరిగింది. ఈ వివాహ బంధమే వెంగళరావు జీవితాన్ని మలుపు తిప్పింది. మాదవరావుకు నాటి నైజాం రాష్ట్రంలోనే వరంగల్ జిల్లా మధిర తాలూకా చౌడవరం గ్రామంలో భూములు, కలప వ్యాపారం ఉండేవి. ఈ విధంగా మామతో కలిసి నైజాం ప్రాంతానికి వచ్చి బయ్యన్నగూడెం గ్రామంలో భూములు కొనుగోలు చేసుకుని స్థిరపడి వ్యవసాయం, వ్యాపారం చూస్తుండేవాడు. నాడు నైజాం ప్రభుత్వం అధికారులు, భూస్వాములు, పటేలులు, పట్వారిలు ఆడిందే ఆటగా, పాడిందే పాటగా ఉండేది. నాటికి వెంగళరావు 22 సంవత్సరముల వయస్సులో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ సంస్థ ఏర్పడి దానికి స్వామి రామానంద తీర్థనాయకులు. ఆ సంస్థలో జలగం వెంగళరావు సభ్యుడిగా చేరి ఒక ప్రక్క వ్యవసాయం, మరో ప్రక్క కాంగ్రెస్ పార్టీ ద్వారా ప్రజలను సమీకరించి గ్రామాలలో దౌర్జన్యాలు, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పనిచేస్తూ నాయకుడిగా రాణిస్తున్న తరుణంలో నిజాం ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీని రద్దుచేయడంతో 1930లో తెలంగాణాలోనే అన్ని జిల్లాలో నాయకులందరూ సమావేశమైన ఆంధ్రమహాసభ ద్వారా నిజాంకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. దేశ వ్యాపితంగా స్వాతంత్రోద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతుందగా నిజాంలో మాత్రం హింసలు రోజురోజుకు పెరుగుతున్నాయి. స్వాతంత్ర్య ఉద్యమం చివరి దశకు చేరుకున్న సమయంలో 1947 ఆగస్టు 15 వ తేదీన దేశం మొత్తం స్వాతంత్ర్యం సిద్ధించిన రోజుకాగా, నిజాం మరికొన్ని సంస్థలు విముక్తికి నోచుకోలేదు. దివంగతులు బొమ్మకంటి సత్యనారాయణ, హైగ్రీవాచారి, మాడపాటి హనుమంతరావులు విజయవాడ కేంద్రంగా పనిచేస్తున్నారు. జలగం వెంగళరావు తిరువూరు కేంద్రంగా చింతలపూడి వరకు కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా నిజాంకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. 1948వ పంవత్సరములో చింతలపూడి వద్ద కొంతమంది కార్యకర్తలతో కలిసి రైఫల్స్ జలగం దళం సంచరిస్తుండగా రజాకారు మూకలతో తారసపడి పోరు సారించి ఆంధ్రాప్రాంతంలోకి రాగానే ఆంద్రా పోలీసులు అరెస్టు చేసి ఏలూరు సబ్ జైల్లో 15 రోజుల పాటు నిర్భందించారు. తదనంతరం జరిగిన అనేక ఘటనల అనంతరం నెహ్రూ ఆధ్వర్యంలోనే కాంగ్రెస్ ప్రభుత్వంలోనే సర్దార్ వల్లభాయి పటేల్ పోలీస్ చర్యతో నిజాం లొంగిపోవడంతోసెప్టెంబర్ 17న నిజాం సంస్థానం స్వతంత్ర్య భారత దేశంలో కలిసింది. రాజకీయ మార్కులలో జిల్లాలోనే ఒక ప్రజా నాయకుడిగా జలగం వెంగళరావు ఎదిగారు. 1952వ సంవత్సరములో దేశవ్యాపితంగా పార్లమెంట్ రాష్ట్ర శాసన సభకు జరిగిన ఎన్నికలలో వేంసూరు నియోజక వర్గం నుండి స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయారు. 1957 వ సంవత్సరములో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికై 1957లో జరిగిన శాసన సభఎన్నికలలో మెజారిటీ స్థానాలు కాంగ్రెస్పార్టీ గెలిచే విధంగా కృషిచేసినాడు. తన సోదరడు జలగం కొండలరావును వేంసూరు నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలిపించారు. వరంగల్ జిల్లా నుండి ఖమ్మం జిల్లా ప్రత్యేకంగా ఏర్పాటు కాగా మొట్టమొదటి ఖమ్మం జిల్లా పరిషత్ ఛైర్మన్ గా ఎన్నికైనారు. 1962 వ సంవత్సరములో రాష్ట్ర శాసన సభకు వేంసూరు నియోజకవర్గం నుండి జలగం వెంగళరావు విజయం సాధించి జిల్లా రాష్ట్ర రాజకీయాల్లో చురుకుగా పాల్గొన్నారు. 1963లో రాష్ట్ర పంచాయతి రాజ్ ఛాంబర్ అధ్యక్షులుగా నియ



మించబడ్డారు. 1969 జూలైలో శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రి వర్గంలో హెూం మంత్రిగా లా అండ్ ఆర్డర్ తో నియమించబడినారు. ఈ కాలంలో పోలీస్ సంక్షేమ చర్యలు బాగా తీసుకున్నారు. పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ ఏర్పాటు చేసారు. 1972 శాసన సభఎన్నికలలో వేంసూరు నుండి విజయం సాధించి దివంగత శ్రీ పి.వి. నరసింహారావు గారి మంత్రి వర్గంలో పరిశ్రమల మంత్రిగా పనిచేసారు. రాష్ట్రంలో అనిశ్చితంగా ఉన్న రాజకీయ పరిస్థితుల దృష్ట్యా హెూం మంత్రిగా, పరిశ్రమల మంత్రిగా, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షునిగా పనిచేసిన అనుభవం దృష్ట్యా శ్రీమతి ఇందిరా గాంధీ నిర్ణయం మేరకు 11 మాసాల రాష్ట్ర పతి పాలన అనంతరం శ్రీ వెంగళరావును ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముఖ్యమంత్రి వర్యులుగా 1973 వ సంవత్సరము డిసెంబర్ 10వ తేదీన మంత్రి వర్గ సహచర్యులతో కలిసి ప్రమాణ స్వీకారం చేసారు. పుట్టినిల్లు ఆంధ్రాబిడ్డగా మెట్టినిల్లు తెలంగాణా నాయకుడిగా ఉభయప్రాంతాల వారికి శ్రీ జలగం వెంగళరావు ఎన్నిక రాష్ట్రంలో రాజకీయాలలో చెరగని ముద్ర వేసారు.

ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కొద్దికాలంలోనే ఆంధ్రా తెలంగాణా రాయలసీమ ప్రాంతాల అభివృద్ధికి తాగు, సాగు, పారిశ్రామిక అభివృద్ధికి ప్రత్యేకప్రణాళికలతో ముందడుగు వేసారు. నాటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీని రాష్ట్రంలో పర్యటింపచేసి బిబి నగర్, నడికుదురు రైల్వే మార్గానికి శంకుస్థాపన చేసి పూర్తి చేసారు. రాయన్నపాడు వద్ద రైల్వే వ్యాగన్ల మరమ్మత్తుల కర్మాగారాన్ని శ్రీమతి ఇందిరాగాంధీచే శంఖుస్థాపన చేసి వెంటనే పూర్తి చేసారు. రాష్ట్రంలో ఆకలి దప్పికలు తీర్చడం కోసం వ్యవసాయ ఉత్పత్తులను పెంచడం కోసం వృధాగా పోతున్న నీటిని వినియోగంలోకి తీసుకురావడం కోసం నాగార్జున సాగర్ కుడి, ఎడమ కాలువలను ప్రపంచ బ్యాంకు సహాయంతో ఇద్దరు ఛీపు ఇంజనీర్లును నియమించి పూర్తి చేసారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా వరంగల్ అదిలాబాద్, నిజాంబాద్ జిల్లాలకు నీరందించే ఏర్పాటు చేసారు. నెల్లూరు జిల్లాలో పెన్నా నదిపై సోమశిల ప్రాజెక్టు ద్వారా నెల్లూరు జిల్లా ప్రజల అవసరాలు తీర్చారు. రాయలసీమకు తాగునీరు అందించడానికి కృష్ణా జలాలను మళ్లించినారు ఈ విధంగా మధ్య తరహా ప్రాజక్టులు చేపట్టారు. వీటిలో సంజీవయ్య సాగర్, సుబ్బరాయ సాగర్, మైలవరం ప్రాజెక్టు, పెన్నా హెూ బిళం, తాలిపేరు, మూకమామిడి, తమ్మిలేరు, జల్లేరు మరియు ఇంకా అనేక సాగునీటి ప్రాజెక్టులు మొదలు పెట్టి కొన్ని పూర్తి అయినవి. మిగిలిన వాటిన తదుపరి వచ్చిన ప్రభుత్వాలు పూర్తి చేసినారు. చదువుకున్న నిరుద్యోగులకు త్వరతగతిన ఉద్యోగాలు అందించడానికి పారిశ్రామిక అభివృద్ధికి ముందు ఆలోచనతో విద్యుత్ ఉత్పాదనను పెంచారు. శ్రీశైలం, నాగార్జునసాగర్, దిగువ సీలేరు, జలవిద్యుత్ కేంద్రాలు, విజయవాడ, కొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తిని పెంచి గృహ అవసరాలు, పారిశ్రామిక అవసరాలు తీర్చి మిగిలిన దానిని ఇతర రాష్ట్రాలకు సప్లై చేసినారు. ఈ విధంగా భద్రాచలం పేపర్ బోర్డు, రాయలసీమ పేపర్ మిల్లు, సిమ్మెంటు కర్మాగారాల ఏర్పాటుకు విశేష కృషిచేసారు. సింగరేణి కాలరీస్ నందు బొగ్గు ఉత్పత్తి పెంపనకు నూతన బొగ్గుబావులను ఏర్పాటు చేసినారు. కేంద్రం చేతిలోకి పోకుండా సింగరేణి సంస్థను కాపాడారు. దేశానికే తలమానికమైన మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్ ను ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయడం నేడు దేశానికి విదేశీ మారక ద్రవ్యం లభిస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో అనేక జిల్లాల్లో జూనియర్, డిగ్రీ, పిజి కళాశాలలు ఏర్పాటుచేసారు .అదే విధంగా గుంటూరులో నాగార్జున యూనివర్సిటీ, వరంగల్లు నందు కాకతీయ యూనివర్సిటీ, హైదరాబాదునందు సెంట్రల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేసి విద్యాభి వృతిద్ధికి ఎనలేని కృషిచేసారు. 1975 లో తెలుగువారందరినీ ఒక దగ్గరకు చేర్చి హైదరాబాదులో ప్రపంచ తెలుగు మహాసభలు మొట్టమొదటిగా నిర్వహించడం ఒక చరిత్రగా నిలుస్తుంది. దివి సీమ ఉప్పెన ఆంధ్రా ప్రజలకు దుర్దినంగా చరిత్రలో మిగలిన దానిని అనతికాలంలోనే అన్ని రకాల అభివృద్ధులతో ప్రజలను ఆదుకుని యధాస్తితికి తీసుకురావడం వెంగళరావు పట్టుదలకు ఒక తార్కాణం. కేంద్రపరిశ్రమల మంత్రిగా 1986 అక్టోబరు 22వ తేదీన రాజీవ్ గాంధీ మంత్రి వర్గంలో చేరి ఔషదాలు తయారు చేసే ఫార్మా సంస్తల మందులను ప్రజలకు అందుబాటులోకి ఉండే విధంగా చేసారు. సిమ్మెంటు, కాగితముల పరిశ్రమలను ఏర్పాటు చేసి దేశ అవసరాలను తీర్చారు. బడా పారిశ్రామిక వేత్తలను దేశాభివృద్ధికొరకు ప్రజా అవసరాలు తీర్చడం కోసం పరిశ్రమలను స్తాపించారు. జై ఆంధ్రా తెలంగాణా ఉద్యమాలతోపాటు నక్సలైటు ఉద్యమాలను క్రమక్రమంగా అణచివేసారు. రాజకీయాలలో అనుభవం సాధించిన వెంగళరావు పాలనా అనుభవంతో రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కీలక భూమికను పోషించడమే కాక పరిపాలన దక్షత కలిగిన నాయకుడిగా ప్రజల, నాయకుల ఆదరాభిమానాలు, విశ్వాసాన్ని చూరగొన్నారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంపై కేంద్రంలో జనతా పార్టీ అధికారంలోకి రాగానే విమద్దలాలు కమీషను వేస్తే నిర్దోషి జలగం వెంగళరావు అని పార్లమెంటులో ప్రకటించారు.

వెంగళరావుకంటే ముందుగా ముఖ్యమంత్రులుగా పనిచేసిన నీలం సంజీవరెడ్డి, దామోదరం సంజీవయ్య, కాసు బ్రహ్మానంద రెడ్డి, పివి నరసింహారావులు ప్రారంభించిన పనులను పూర్తి చేయడమే కాక నూతన ప్రాజెక్టులను ప్రారంభించి పూర్తి చేసి రాష్ట్రాభివృద్ధికి విశేష కృషి చేసారు. వెంగళరావు సోదరుడు జలగం కొండలరావు ఒక సారి ఎమ్మెల్యేగా రెండు పర్యాయాలు ఖమ్మం యం.పిగా, జిల్లా పరిషత్ ఛైర్మన్గాగా పనిచేసినారు. పెద్దకుమారుడు జలగం ప్రసాదరావు, జిల్లా కో ఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ గా, రెండు పర్యాయాలు సత్తుపల్లి ఎమ్మెల్యే గా విజయం సాదించి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి మంత్రి వర్గంలో పంచాయతి రాజ్ శాఖా మంత్రిగా పనిచేసినారు. చిన్న కుమారుడు జలగం వెంకటరావు సత్తుపల్లి నియోజకవర్గం నుండి ఒక సారి, కొత్తగూడెం నియోజకవర్గం నుండి ఒక సారి గెలిచి రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ప్రజలకు విశేష సేవలు అందించినారు. ఈ విధంగా ఖమ్మం జిల్లా నుండి రాజకీయాలు నడిపిన శ్రీ జలగం వెంగళరావు కుటుంబం ఆరుదశాబ్దాలుగా జిల్లాలో, రాష్ట్రంలో, కేంద్రంలో రాజకీయాలు నిరాటంకంగా కొనసాగిస్తున్నారు.

శ్రీ జలగం వెంగళరావు ప్రజల విశ్వాసంతో నమ్మకమైన ప్రజానాయకుడిగా వెలుగొందారు. 198489 ఖమ్మం పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసినపుడు అందరూ ఏకమై జలగం వెంగళరావుకు వ్యతిరేకంగా పనిచేసారు. అయినా బహిరంగ సభల్లో శ్రీ జలగం మాట్లాడుతూ నాగార్జున సాగర్ నీళ్లలో నా నీడ కనపడద్ది, తినే పళ్ళెంలో వెంగళరావు బొమ్మకనపడద్ది అని ధైర్యంగా చెప్పగలిగిన ఏకైక నాయకుడు జలగం. నన్ను ప్రజలు నాయకుడిగా నెలబెట్టారు. వారి పనులు పూర్తి చేస్తాను. అని అంత విశ్వాసంగా బలంగా ప్రజలకు మనోధైర్యాన్ని కలిగించే నాయకుడే జలగం వెంగళరావు. ఎందరు ఏకమైనా నన్ను ఏమి చేయలేరు అని చెప్పిన ప్రజా నాయకుడు పరిపాలనా దక్షుడు నిరంతర శ్రమ జీవి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కొరకు నిరంతరం తపన పడే వ్యక్తి శ్రీ జలగం వెంగళరావు నేటి తరం నాయకులకు ఆదర్శవంతుడు. తన తుది శ్వాసను జూన్ 12 1999 వ తేదీన హైదరాబాద్లో తన స్వగృహం నందు విడిచినారు.

**(ఈ నెల 12వ తేదీన 27వ వర్ధంతి సందర్భంగా)**

**- గోపిశెట్టి వెంకటేశ్వరరావు,** యం.ఎ.బిఇడి,
విశ్రాంత ఉపాధ్యాయులు - విశ్లేషకులు,
రంగారావుబంజర్, పెనుబల్లి మండలం, ఖమ్మం జిల్లా

# 75 లక్షల వ్యయంతో కల్వర్టు పనులకు శంకుస్థాపన



## నగర మేయర్, ఎమ్మెల్యే నాయిని

**హన్మకొండ మహా;** బల్దియా పరిధి నగర మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న 29వ డివిజన్ భద్రకాళి బండ్ సమీపంలో బల్దియా సాధారణ నిధుల కింద రూ.75 లక్షల అంచనా వ్యయం తో నిర్మించనున్న కల్వర్టు పనులకు స్థానిక వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తో కలిసి నగర మేయర్ గుండు సుధారాణి శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, అదనపు కమిషనర్ జోనా, సి.ఎం.హెచ్.ఓ డా.రాజారెడ్డి, ఈ ఈ రవి కుమార్, ఏంహెచ్ఓ డా.రాజేష్, డి ఈ రాజ్ కుమార్, మాజీ కౌన్సిలర్ బుద్ధ జగన్, డివిజన్ అధ్యక్షులు పూర్ణ, నల్లగుంట శ్రీనివాస్, రఫీక్, సౌరం బాలకృష్ణ, సదాశివుడు, ఈసంపెల్లి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# కమిషన్ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు

## ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్

**హన్మకొండ మహా;** నీళ్లు, నిధులు నియామకాల నినాదంతో తెలంగాణ స్వరాష్ట్ర సాధనకై ఉద్యమాన్ని ప్రారంభించి ఆ గమ్యాన్ని ముద్దాడి, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన యోధుడు, ఉద్యమ నేత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు అని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా ఏర్పాటు చేసిన కమిషన్ ముందుకు బుధవారం కేసీఆర్ హైదరాబాద్ లోని బీఆర్కే భవన్ కు హాజరు కాగా అక్కడికి దాస్యం వినయ్ భాస్కర్ పశ్చిమ నియోజకవర్గ శ్రేణులతో కలిసి భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... తెలంగాణ తాగునీటి, సాగునీటి తండ్లాట ను తీర్చిన అపర భగీరథుడు కేసీఆర్ అని అన్నారు. 60 ఏళ్ల సమైక్య పాలనలో తెలంగాణ వ్యాప్తంగా వ్యవసాయానికి కనీసం ఒక్క పంటకు నీళ్లు ఇచ్చిన పాపాన పోలేదని, కేసీఆర్ రెండున్నర ఏళ్లలో తాగునీటి సాగునీటి అవసరాల కోసం ప్రాజెక్టుల పునరుద్ధరణ, రీ డిజైన్ లతో గోదావరి, కృష్ణ నది జలాలను ఒడిసిపట్టి తెలంగాణ మాగాణి లకు నీళ్ళు తరలించారని కొనియాడారు. తెలంగాణకు సాగు, తాగు నీరు విషయంలో తీరని అన్యాయం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు ఇచ్చిన



కేసీఆర్ పై నిందలు మోపడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలతోనే కేసీఆర్ ను ఇబ్బంది పెట్టాలని, తెలంగాణను మళ్లీ ఎడారిగా చేయాలని చూస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ దర్శనీకత, కార్య దక్షతతోనే సాగునీటి ప్రాజెక్టులు పూర్తయ్యాయని తెలంగాణ కోటి ఎకరాల మాగణం సాకారం అయింది, మూడు కోట్ల టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి తో దేశంలోనే తెలంగాణ అగ్ర భాగాన నిలిచింది. తెలంగాణలో నీలి విప్లవం, హరిత విప్లవం సృష్టించిన సృష్టికర్త కేసీఆర్ అని కొనియాడారు. కాంగ్రెస్ కమిషన్ కేసీఆర్ ను తప్పుగా చిత్రీకరించే ప్రయత్నం చేసినా ప్రజల హృదయాల్లో ఆయన సాగునీటి, తాగునీటి అవసరాల కోసం చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ తో మాజీ ఎమ్మెల్యేలు, భారాసా సీనియర్ నాయకులు నాగూర్ల వెంకన్న, ముఖ్య నాయకులు తదితరులు ఉన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యత

## బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే

**వరంగల్ మహా;** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం సామాజిక బాధ్యత అని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అభిప్రాయపడ్డారు. వంద రోజుల కార్యాచరణ ప్రోగ్రామ్ లో భాగంగా బుధవారం హనుమకొండ పరిధి 58,59 డివిజన్ లలో గల ఇందిరానగర్ ఎన్జీవోస్ కాలనీ భవాని నగర్ ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన డెసిల్టేషన్ ప్రక్రియ తడి పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోలకు అందించడం సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా దోమలను అరికట్టడానికి చేపట్టే ఆంటీ లార్వా ఆక్టివిటీస్ ట్రేడ్ లైసెన్స్, వసూళ్ల తీరును కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.




అంతకుముందు నిర్వహించిన అవగాహన ర్యాలీ తో పాటు కరపత్రాల పంపిణీ గృహాలకు స్టికర్ అతికించిన విధానాన్ని కమిషనర్ స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గుజ్జుల వసంత ఇమ్మడి లోహిత రాజు సి ఎం హెచ్ ఓ డా. రాజారెడ్డి డి ఈ సారంగం, సానిటరీ ఇన్స్పెక్టర్ భాషా నాయక్, హెల్త్ ఇన్స్పెక్టర్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన సీఐగా మచ్చ శివ కుమార్ బాధ్యతలు స్వీకరణ

**హన్మకొండ మహా;** హన్మకొండ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా మచ్చ శివ కుమార్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. హనుమకొండ పోలీస్ స్టేషన్ సిఐ గా మచ్చ శివకుమార్ ను నియమిస్తూ మంగళవారం పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సైలు, సిబ్బంది తో పాటు పలువురు ఆయనకు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.




# ఎనుమాముల నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన జె సురేష్

**వరంగల్ మహా;** వరంగల్ ఎనుమాముల పోలీస్ స్టేషన్ కు నూతన ఇన్స్పెక్టర్ గా జవ్వాజి సురేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ రాజు , సిబ్బంది తో పాటు పలువురు ఆయనకు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.




# వైభవంగా శ్రీ గోవిందరాజస్వామి గిరి ప్రదక్షణ కార్యక్రమం



**వరంగల్ మహా:** వరంగల్ మహా నగర ఇలవేల్పు శ్రీశ్రీశ్రీ గోవిందరాజస్వామి దేవాలయంలో జేష్ట మాసం గిరి పూర్ణిమ ను పురస్కరించుకొని గిరి ప్రదక్షణ కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో భక్తులు, అనువంశిక అర్చకులు, పాలకమండలి, ముదిరాజ్ నాయకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి పల్లకిని పురవీధుల్లో ఊరేగించారు. ఈ ఊరేగింపులో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని శ్రీ గోవిందరాజ స్వామి అనుగ్రహాన్ని పొందారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ పెద్దలు చింతాకుల సునీల్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మీసాల ప్రకాష్ , జారితి శ్రీనివాస్ , పర్స శ్రీను, గోవిందాద్రి సేవాదళ్ సభ్యులు, అడీక రంజిత్ ,యాట ప్రతాప్, సాయి ,అరుణ్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# మేడిగడ్డ బ్యారేజీ దుర్ఘటన బాధిత కుటుంబాలకు పరామర్శ

## పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

**భూపాలపల్లి, మహా :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో మేడిగడ్డ బ్యారేజీ వద్ద జరిగిన దుర్ఘటనలో గల్లంతై ప్రాణాలు కోల్పోయిన యువకుల కుటుంబాలను పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ బుధవారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ప్రభుత్వం తరపున తన వ్యక్తిగతంగా అన్నిరకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పర్యటనలో భాగంగా ఎంపీ వంశీకృష్ణ ముందుగా అంబటిపల్లి క్రాస్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంబటిపల్లి,కోర్లకుంట,స్తంబంపల్లి పీపీ గ్రామాల్లో దుర్ఘటనలో



మరణించిన యువకుల కుటుంబాలను ఒక్కొక్కరిని స్వయంగా కలసి పరామర్శించారు. మహదేవపూర్ మండలం ఎల్కేశ్వరంలో ఫిట్స్‌తో మృతి చెందిన రాళ్లబండి నాగరాజు కుటుంబాన్ని కూడా పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఎంపీ గారు మాట్లాడుతూ ఇతరచోట్ల ఆసరాగా నిలవాల్సిన యువకులు ఇలా ఒకేసారి వెళ్లిపోవడం తల్లి దండ్రులకు తీరని లోటు. ఈ బాధను మేము గుండె లోతుల్లోనుంచి అనుభవిస్తున్నాం. ఈ కుటుంబాలకు న్యాయం జరిగేలా, ఆర్థికంగా ఆదుకునేలా అన్ని విధాలా కృషి చేస్తా అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే జిల్లా ఎస్పీతో మాట్లాడి గాలింపు చర్యలు వేగవంతం చేయాలని సూచించినట్టు తెలిపారు. ఇటువంటి విషాద సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలపై సంబంధిత అధికారులకు స్పష్టమైన సూచనలు ఇస్తామని ఎంపీ తెలిపారు.ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# పేద ప్రజలకు అండగా ఎర్రజెండా అదే మా ఏజెండా

## సిపిఐ చేవెళ్ల మండల కార్యదర్శి ఎం సత్తిరెడ్డి

**రంగారెడ్డి జిల్లా మహా:** చేవెళ్ల మండలంలోని అంబేద్కర్ భవనంలో సిపిఐ మండల మహాసభలు ఘనంగా జరిగినాయి. ఈ మండల మహాసభలలో సిపిఐ చేవెళ్ల మండల నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. రెండవసారి మండల కార్యదర్శిగా ఏం సత్తిరెడ్డి, సహాయ సహాయ కార్యదర్శులుగా ఎండి మక్బుల్, వడ్ల మంజులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా చేవెళ్ల మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మండల కార్యదర్శి ఎం సత్తిరెడ్డి మాట్లాడుతూ... నాపై ఎంతో నమ్మకం ఉంచి నాకు రెండవసారి సిపిఐ మండల కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు, జిల్లా నాయకత్వానికి మండల నాయకత్వానికి ప్రజా సంఘాల నాయకులకు కార్యకర్తలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. పేద ప్రజలకు అండగా ఎర్రజెండా ఉంటుందని అదే మా ఎజెండా అని తెలిపారు. పార్టీ నిర్మాణం కోసం ప్రజాసంఘాల నిర్మాణం కోసం మేమందరం కష్టపడి పనిచేసి, పేద ప్రజలకు కష్ట జీవులకు కర్షకులకు రైతులకు ఏ సమస్య వచ్చినా అండగా నిలబడి పోరాడుతామని తెలిపారు.

# స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించండి

## తెలంగాణ ప్రాంత ప్రచార ప్రముఖ్ కేశవ్ సోని




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** స్వదేశీ ఉత్పత్తులను ఉపయోగించమని మరియు చైనా, టర్కీ వస్తువులను బహిష్కరించాలని ప్రజలను ప్రోత్సహిస్తూ, స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో "స్వదేశీ, సురక్ష ఔర్ స్వావలంబన్ అభియాన్" కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, బొంగ్లూర్‌లోని ఎస్.ఆర్. జూనియర్ కాలేజీలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి స్వదేశీ జాగరణ మంచ్ తెలంగాణ ప్రాంత ప్రచార ప్రముఖ్ కేశవ్ సోని హాజరై, విద్యార్థులకు స్వదేశీ ఆవశ్యకతను వివరిస్తూ చైనా, టర్కీ వస్తువుల భయంకరమైన నేపథ్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చైనా, టర్కీ వంటి దేశాలు పాకిస్తాన్‌కు బలమైన మద్దతు ఇస్తూ, భారతదేశంపై ఉగ్రవాద చర్యలను ప్రోత్సహిస్తున్నాయని, చైనా పాకిస్తాన్‌కి ఆర్థిక, సాంకేతిక మద్దతును అందిస్తున్నట్లే, టర్కీ కూడా భారత్ వ్యతిరేక దుష్ప్రచారానికి వేదిక అవుతోందన్నారు. అలాంటి దేశాల ఉత్పత్తులను మనం కొనడం ద్వారానే వారి ఆర్థిక శక్తిని పెంచుతున్నామని తెలిపారు. ఇటీవల భారత సైన్యం నిర్వహించిన "ఆపరేషన్ సింధూర్" ద్వారా పాక్ ఆధారిత ఉగ్రవాదాన్ని ధ్వంసం చేయడం, మన దేశ భద్రతాపరంగా ఎంతగా అప్రమత్తంగా ఉందో నిరూపించింది. కానీ భారత పౌరులుగా మన బాధ్యత కూడా మనం నిర్వర్తించాలంటే, ఉగ్రవాదాన్ని పోషించే దేశాల ఉత్పత్తులకు మన మార్కెట్లలో చోటివ్వకుండా, వాటిని పూర్తిగా బహిష్కరించాలని తెలిపారు. "స్వదేశీ, సురక్ష ఔర్ స్వావలంబన్ అభియాన్" ద్వారా, ఈ ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా సామూహిక ఉద్యమంగా మలచాలని స్వదేశీ జాగరణ మంచ్ సంకల్పించిందని తెలిపారు. యువత, మహిళలు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నిపుణులు సహా ప్రతి భారతీయుడు స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించి, దేశాన్ని ఆర్థికంగా స్వావలంబన దిశగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వదేశీ జాగరణ మంచ్ రంగారెడ్డి జిల్లా ప్రచార ప్రముఖ్ భాను చందర్, సభ్యులు సాహిత్, మనీష్, ప్రదీప్, సాయి, విజయ్, సంతోష్ మరియు తదితరులు పాల్గొన్నారు.



# జస్టిస్ పీసీ ఘోష్ ను కలిసిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**హన్మకొండ మహా;** సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్ కు బుధవారం చేరుకోగా ఆయనను హనుమకొండ జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించి స్వాగతం పలికారు. కలెక్టర్ వెంట పలువురు అధికారులు ఉన్నారు.

# భూపాలపల్లి జిల్లాలో పర్యటించిన ట్రైనీ ఐఏఎస్‌లు

**భూపాలపల్లి, మహా :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 2024 బ్యాచ్ సివిల్ సర్వీసెస్ శిక్షణా అధికారుల బృందం సౌరభ్ శర్మ, శ్రీమతి సలోని ఛబ్రా, హర్ష చౌదరి, శ్రీమతి కెరోలిన్ చింగ్తియన మావి, కోయ్యాడ ప్రణయ్ కుమార్, బుధవారం రేగొండ మండలంలోని పాండవుల గుట్టలను సందర్శించి గుట్టలలోని కుంతి గుహలు, భీముని గుండు, ప్రాచీన కాలం నాటి రాతి పెంటింగ్స్ తిలకించారు. అనంతరం కెటికె ఓపెన్ కాస్ట్ 2ను సందర్శించి బ్లాస్టింగ్, ఓపెన్ కాస్ట్ లో బొగ్గు ఉత్పత్తిని పరిశీలించి అక్కడి నుండి కేటికె 5 ఇంక్లైన్ ఉపరితల బొగ్గు గని లోపలికి దిగి బొగ్గు తీయు విధానాన్ని పరిశీలించారు. అనంతరం కాళేశ్వరం వెళ్ళిపోయారుఈ పర్యటనలో పర్యావరణ పరిరక్షణ, పురావస్తు ప్రాముఖ్యత, పర్యాటక అభివృద్ధి అవకాశాలపై అవగాహన పొందారు. ఈ సందర్భంగా అధికారులు పాండవులగుట్ట చరిత్రను తెలుసుకున్నారు. శిక్షణలో భాగంగా మన జిల్లాలో నేడు, రేపు రెండు



రోజుల పాటు పర్యటించనున్నారు. తెలంగాణ దర్శన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సందర్శించనున్నారు. పాండవుల గుట్ట, సింగరేణి బొగ్గు గనులు (ఓపెన్ కాస్ట్ మరియు అండర్‌గ్రౌండ్), శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయం, కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టులను సందర్శించనున్నారు. డా. కందుకూరి ఉషారాణి, కోర్సు డైరెక్టర్ మరియు వి. శ్రీనివాస్, నోడల్ అధికారులు శిక్షణ అధికారుల పర్యటనలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో రేగొండ తహసీల్దార్ శ్వేతా పాల్గొన్నారు.

# పీవీ విజ్ఞాన కేంద్రం పనులను త్వరగా పూర్తి చేయాలి

## వంగరలో పీవీ విజ్ఞాన కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**హన్మకొండ మహా;** పీవీ విజ్ఞాన కేంద్రం నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని సంబంధిత శాఖ అధికారులను హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. బుధవారం మాజీ ప్రధాని పీవీ నరసింహారావు స్వగ్రామమైన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలో నిర్మిస్తున్న పీవీ విజ్ఞాన కేంద్రం నిర్మాణ పనులు తుది దశకు చేరుకోగా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. విజ్ఞాన కేంద్రం నిర్మాణ పనుల గురించి పర్యాటక శాఖ డిఈఈ ధన్ రాజ్ ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ



పెయింటింగ్, ప్లంబింగ్, డోర్స్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# గునగల్ గ్రామంలో రెవెన్యూ సదస్సు

## రైతులు భూ సమస్యలు పరిష్కరించుకోవాలి.. మాజీ వైస్ ఎంపీపీ గజ్జి రామకృష్ణ

**రంగారెడ్డి జిల్లా మహా:** గునగల్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యల పరిష్కారం చేసుకోవాలని యాచారం మండలం మాజీ వైస్ ఎంపీపీ గజ్జి రామకృష్ణ అన్నారు. యాచారం మండలం, గునగల్ గ్రామంలో భూభారతి మాడ్యూల్స్ పై తాసిల్దార్ అయ్యప్ప సమక్షంలో రైతులకు అవగాహన కొరకు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు భూభారతిని వినియోగించుకొని, భూ సమస్యలు పరిష్కరించుకోవాలని తహసిల్దార్ అయ్యప్ప రైతులకు తెలిపారు. మాజీ వైస్ ఎంపీపీ గజ్జి రామకృష్ణ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతితో రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయని, ప్రభుత్వం రైతుల పక్షాన రైతుల శ్రేయస్సు కోరే ప్రభుత్వం, కావున భూ సమస్యలు ఏమైనా ఉంటే రెవెన్యూ అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలని ఆయన రైతులను కోరారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంది



రమ్మ ఇండ్ల లబ్ధిదారులు, ప్రభుత్వం నిర్ణయించిన గడువులోపు ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో యాచారం మండలం రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ పవన్, పిఏసిఎస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బుచ్చిరెడ్డి, మచ్చ లక్ష్మణ్, కాశమళ్ల యాదయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



ఆయిల్ పామ్ కొనుగోలు కేంద్రాన్ని

# ప్రారంభించిన ఎమ్మెల్యే, కలెక్టర్

**వరంగల్ మహా;** ఆయిల్ పామ్ కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తో కలసి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నర్సంపేట డివిజన్ పరిధిలో ఆయిల్ ఫాం సాగు చేసిన రైతుల కాపుదశకు వచ్చిన వాటి నుండి సేకరించిన గెలలను రైతులు విక్రయించడం కొరకు ఆయిల్పాం కంపెనీ తరపున కొనుగోలు కేంద్రాన్ని నర్సంపేట డివిజన్లో ప్రారంభించుకోవడం జరిగిందని, ఇప్పటివరకు సాగు చేసినటువంటి ఆయిల్ ఫామ్ యొక్క సాగు 6000 ఎకరాల వరకు ఉందని, ఇంకా రైతులు ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలని కోరారు. మార్కెట్ సమస్య, దళారుల సమస్య, కోతుల సమస్య, ధరల సమస్య లేనటువంటి పంట ఆయిల్ పామ్ దీనికి రాష్ట్ర ప్రభుత్వం రాయితీలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పెద్ద రైతులు ఎత్తున సాగు చేయాలని కోరారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ప్రతి ఏడాది స్థిరమైన ఆదాయం వచ్చే విధంగా రైతులు ప్రత్నామయ పంటలపై దృష్టి సారించాలన్నారు. ఆయిల్ ఫామ్ పండించి తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందిన రైతులనుఆదర్శంగా తీసుకొని రైతులు ముందుకు వచ్చి ఆయిల్ ఫామ్ సాగు చేయాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, రామ్ చరణ్, ఆయిల్ ఇండస్ట్రీస్ జిఎం నారాయణ, డిహెచ్ఎస్ వో జి అనసూయ, ఉద్యాన అధికారులు జ్యోతి తిరుపతి రాకేష్ మరియు రైతులు పాల్గొన్నారు. అనంతరం గెలలు కొనుగోలు చేసిన అనంతరం రైతుకు చెక్కు రూపంలో ప్రభుత్వ నిర్ణయించిన ధర ప్రకారం డబ్బులు చెల్లించడం జరిగింది.



# ప్రభుత్వ స్థలాలను కాపాడండి

**రంగారెడ్డి జిల్లా మహా:** ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కోరుతూ, బుధవారం ఆమనగల్లు మున్సిపాలిటీ కమిషనర్ కు, గంగ భవాని కాలనీ వాసులు వినతి పత్రం అందజేశారు. గతంలో ఈ స్థలంను దివంగత మాజీ ఎంపీ నంది ఎల్లయ్య, ఏఐసీసీ సభ్యుడు మాజీ ఎమ్మెల్యే చల్ల వంశీ చంద్ రెడ్డి భూమి పూజ చేయడం జరిగింది. కొంత మంది భూ బకాసురులు ఒక ముఠాగా ఏర్పడి, ఆ స్థలంను అన్యక్రాంతం చేయాలని చూస్తున్నారు. ఆ స్థలం కబ్జా బారిన పడకుండా చూడాలని పట్టణ ప్రజలు, కాలనీ వాసులు కోరుతున్నారు. కార్యక్రమంలో బాలకృష్ణ, వెంకటయ్య, బాబా, ప్రశాంత్, సైదులు, నరేష్, రమేష్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేయాలి

## మావోయిస్టు లతో శాంతి చర్చలు జరపాలి.. సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి




**వరంగల్ మహా;** సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేసి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయం తమ్మెర భవన్ లో జరిగిన వామపక్ష పార్టీలు ప్రజాసంఘాల సమావేశానికి న్యూ డెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు అధ్యక్షత అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కేంద్ర ప్రభుత్వాలు అనేక సందర్భాల్లో వేర్పాటు వాదులతో, ఉగ్రవాదులతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించుకున్న దాఖలాలు అనేకం ఉన్నాయని, కానీ నేటి మోడీ ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపకుండా మావోయిస్టులను వచ్చే మార్చి కల్లా అంతం చేస్తామని ప్రకటించడం సమంజసం కాదని హింసకు హింస పరిష్కారం ఎన్నటికీ కరెక్ట్ కాదని అన్నారు. మావోయిస్టులు ఆదివాసీలు తమ అమూల్యమైన ప్రాణాలు కోల్పోతున్నారని అడవుల్లోని ఖనిజ నిక్షేపాలను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు మావోయిస్టులు, ఆదివాసీలు అడ్డుగా ఉన్నారనే కారణం తోనే ఈ ఆపరేషన్ కగార్ అని అన్నారు, అన్ని పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి మావోయిస్టు లతో మేధావుల సమక్షంలో శాంతి చర్చలు జరిపి దేశంలో శాంతిని నెలకొల్పాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదని మోడీ ప్రభుత్వం గుర్తించాలని కోరారు. మావోయిస్టుల పేరుతో చంపుకుంటూ పోవడం వల్ల సమస్యను ఎప్పటికీ పరిష్కరించలేరని, దీనికి చర్చలే మంచి పరిష్కార మార్గమని తెలుసుకోవాలని గత అనుభవాలు కూడా మనకు తెలియపరుస్తున్నాయని అన్నారు. లేనిపక్షంలో వామపక్ష పార్టీలు ప్రజా సంఘాలు ఐక్యంగా ప్రజలందరినీ ఐక్యం చేసి తగిన విధంగా గుణపాఠం చెప్పాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈనెల 14 వ తేదీన ఆపరేషన్ కగార్ ను నిలిపేయాలని డిమాండ్ చేస్తూ వరంగల్ రైల్వే స్టేషన్ నుండి ఉదయం 10 గంటలకు ప్రదర్శన ఉంటుందని అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వలదాసు దుర్గయ్య, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి,సిపిఐ( ఏం ఎల్ ) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గంగుల దయాకర్, ఎం సి పి ఐ (యు) నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్, భారత్ బచావో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం వెంగల్ రెడ్డి,తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకులు జనగాం కుమారస్వామి,ఏ ఐ డి ఎస్ ఓ నాయకులు కె సురేష్ పాల్గొన్నారు.

# యువతకు సత్య నాదెళ్ల సూచన




కృత్రిమ మేధకు ఆదరణ పెరుగుతున్న ప్రస్తుత రోజుల్లో కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు, ఔత్సాహిక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు బేసిక్స్‌పై పట్టు సాధించాలని మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల సూచించారు. టెక్ యూట్యూబర్ సజ్జాద్ ఖాడేతో జరిగిన ఇంటర్వ్యూ సందర్భంగా సత్య నాదెళ్ల మాట్లాడుతూ.. ఏఐ కోడింగ్, ఇతర సంక్లిష్టమైన పనులను ఆటోమేట్ చేస్తున్నప్పటికీ టెక్ డెవలప్‌మెంట్‌కు మానవ నైపుణ్యాలు అవసరం అవుతాయని చెప్పారు. బలమైన కంప్యూటేషనల్ థింకింగ్, సిస్టమ్ డిజైన్ నైపుణ్యాలపై ఎక్కువగా ఆధారపడుతున్నట్లు పేర్కొన్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ ప్రాథమికాంశాలపై దృష్టి పెట్టడం చాలా ముఖ్యమని ఈ సందర్భంగా సత్య నాదెళ్ల స్పష్టం చేశారు. సమస్యలను తార్కికంగా పరిష్కరించాలని, నిర్మాణాత్మక సొల్యూషన్స్ సృష్టించాల్సిన అవసరం ఉందన్నారు. సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్ట్‌గా ఎదిగేందుకు ఏఐ మానవుల ప్రయాణాన్ని వేగవంతం చేస్తోందని సత్య పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయిలో వ్యవస్థలను అర్థం చేసుకోవాలని చెప్పారు. భవిష్యత్తులో సిస్టమ్ కాంప్రహెన్షన్‌కు పెరుగుతున్న ప్రాముఖ్యతను సత్య సూచించారు.

### సుందర్ పిచాయ్ కూడా అదే బాటలో..

**లెక్స్ ఫ్రిడ్‌మన్‌తో గతంలో జరిగిన పాడ్‌కాస్ట్‌లో గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ మాట్లాడుతూ కంప్యూటర్ కోడింగ్ రాసేందుకు 30% ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయపడుతుందని చెప్పారు. మరింత సృజనాత్మక పనుల కోసం మానవ ప్రతిభ తప్పకుండా అవసరం అవుతుందన్నారు. ఏఐ తమ ఇంజినీరింగ్ వేగాన్ని 10% పెంచిందని చెప్పారు. వచ్చే సంవత్సరం మరింత మంది ఏఐ ఇంజినీర్లను నియమించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పిచాయ్ తెలిపారు.**

# ఉద్యోగులు ఆఫీస్‌కు రాకపోతే.. గూగుల్ కొత్త ఎత్తుగడ

ఉద్యోగులను తగ్గించుకునేందుకు టెక్ దిగ్గజం గూగుల్ కొత్త ఎత్తుగడ ఎత్తుకుంది. వర్క్ ఫ్రమ్ ఆఫీస్ విధానం బలోపేతం పేరుతో సాధ్యమైనంత మేర ఉద్యగులను వదిలించుకునేందుకు ప్రణాళిక వేసింది. అమెరికాలో రిమోట్ వర్క్ విషయంలో గూగుల్ కఠినమైన విధానాన్ని తీసుకుంది. ఉద్యోగులను కార్యాలయానికి తిరిగి రావాలని లేదా స్వచ్ఛంద నిష్క్రమణ ప్యాకేజీని ఎంచుకోవాలని కోరింది. కొత్త ఆదేశాల ప్రకారం.. గూగుల్‌లోని కోర్, మార్కెటింగ్, రీసెర్చ్, నాలెడ్జ్ అండ్ ఇన్ఫర్మేషన్ (కేఅండ్ఐ), కమ్యూనికేషన్స్ సహా కీలక విభాగాల్లోని ఉద్యోగులు వారానికి కనీసం మూడు రోజులు ఆఫీసుకు తిరిగి రావాల్సి ఉంటుంది. ఈ విధానం ప్రధానంగా గూగుల్ కార్యాలయానికి 50 మైళ్ల లోపల నివసించే ఉద్యోగులను ప్రభావితం చేస్తుంది. ఇది పనిప్రాంత అంచనాలలో గణనీయమైన మార్పును సూచిస్తుంది. ఈ పరివర్తనను సులభతరం చేయడానికి, గూగుల్ కొత్త మార్గదర్శకాలను పాటించని యూఎస్ ఆధారిత ఉద్యోగులకు స్వచ్ఛంద తొలగింపు ప్యాకేజీలను అందిస్తోంది. అయితే ఇవి తొలగింపులు కాదని గూగుల్ చెబుతున్నప్పటికీ, ఇలాంటి నిష్క్రమణ కార్యక్రమాలు చారిత్రాత్మకంగా విస్తృతమైన శ్రామిక శక్తి తగ్గింపులకు ముందు అమలవుతున్నవే. ఉద్యోగుల వ్యక్తిగత సహకారం నేరుగా ఆఫీస్‌లలో ఉండాలని భావిస్తున్న గూగుల్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు ఏఐ ఫోకస్డ్ కార్యక్రమాలనూ టెక్ దిగ్గజం వేగవంతం చేసింది. కంపెనీలు తమ సొంత రిమోట్ వర్క్ వ్యూహాలను పునఃసమీక్షిస్తున్నందున, ఈ విధానం టెక్ పరిశ్రమ అంతటా ప్రకంపనలు సృష్టిస్తుందని నిపుణులు భావిస్తున్నారు. గూగుల్ తాజా ఈ ప్రకటన కొన్ని ఆందోళనలను రేకెత్తిస్తోంది. గతంలో గూగుల్ ఇదే తరహా ఎగ్జిట్ ఆఫర్లు ఇచ్చి ఉద్యోగాల కోత విధించింది. 2023లో కంపెనీ ప్రపంచవ్యాప్తంగా 12,000 మంది ఉద్యోగులను తొలగించగా, ఈ ఏడాది కూడా ట్రెజరీ, బిజినెస్ సర్వీసెస్ వంటి విభాగాల్లో చిన్నపాటి తొలగింపులు చేపట్టింది. ఈసారి ఎంతమందిపై ప్రభావం పడుతుందో స్పష్టంగా తెలియనప్పటికీ.. గూగుల్ తన ఎక్కువ మంది సిబ్బందిని ఆఫీస్‌లకు తిరిగి రప్పించాలని భావిస్తోంది. ఇందుకు ఇష్టపడని వాళ్లు ఉద్యోగం వీడాల్సి ఉంటుంది.




# నథింగ్ ఫోన్ 3 లాంచ్ డేట్ ఫిక్స్.. ఫీచర్లు ఇవేనా..

బ్రిటన్‌కు చెందిన ప్రముఖ మొబైల్ ఫోన్ తయారీ సంస్థ నథింగ్ టెక్నాలజీ లిమిటెడ్ 'నథింగ్ ఫోన్ 3'ను జులై 1, 2025న లాంచ్ చేయనున్నట్లు తెలిపింది. గతంలో ఉన్న మోడళ్లతో పోలిస్తే దీనిలో కొన్ని డిజైన్, హార్డ్‌వేర్‌లో మార్పులను తీసుకొస్తున్నట్లు పేర్కొంది. అయితే టెక్ నిపుణుల అంచనాల ప్రకారం నథింగ్ ఫోన్ 3లో తీసుకొస్తున్న మార్పులు కింది విధంగా ఉండనున్నాయి.

**ఇంటర్‌ఫేస్:** కంపెనీ ఉత్పత్తులకు సిగ్నేచర్‌గా నిలిచిన ఎల్‌ఈడీ లైటింగ్ సిస్టమ్‌ను తొలగించడం లేదు.

**మూడు 50 ఎంపీ కెమెరాలు:** మెరుగైన ఫొటోగ్రఫీ కోసం ప్రధాన, అల్ట్రావైడ్, టెలిఫోటో లెన్స్‌లతో కొత్త కెమెరా మాడ్యూళ్లను అందిస్తుంది.

**స్నాప్ డ్రాగన్ 8 ఎలైట్ లేదా జెన్ 3:** క్వాల్ కామ్ స్నాప్ డ్రాగన్ చిప్ సెట్ 8 ప్రాసెసర్‌తో మార్కెట్‌లోకి తీసుకొస్తారని భావిస్తున్నారు. ఇది అధిక పనితీరు, ఏఐ ఆధారిత ఫీచర్లను అందిస్తుంది.

**నథింగ్ ఓఎస్ 3.0 (ఆండ్రాయిడ్ 15):** మెరుగైన యూజర్ అనుభవం కోసం ఇంటర్నల్‌గా నథింగ్ ఓఎస్ 3.0ను తీసుకొస్తున్నట్లు తెలుస్తుంది.



**6.77 అంగుళాల ఎమోలెడ్ డిస్‌ప్లే:** 120 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్, 3,000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్, మెరుగైన విజువల్స్ కోసం ఎల్‌టీపీఓ టెక్నాలజీ.

**5,000 ఎమ్ఏహెచ్ బ్యాటరీ:** 50 వాట్ వైర్డ్, 25 వాట్ వైర్‌లెస్ ఛార్జింగ్ సదుపాయం ఉంటుంది.

**ధరలు ఇలా.. (అంచనా మాత్రమే)**

ఇండియాలో రూ.60,000రూ.65,000

**అంతర్జాతీయ మార్కెట్‌లో:** 799 డాలర్లు - 899 డాలర్లు (సుమారు రూ.68,000-రూ.73,000)

# లాభాల్లో ముగిసిన మార్కెట్లు.. దూసుకెళ్లిన ఐటీ షేర్లు

దేశీయ స్టాక్‌మార్కెట్లు బుధవారం లాభాలలో ముగిశాయి. అమెరికాచైనా వాణిజ్య చర్చల్లో పురోగతి సంకేతాల మధ్య ఇతర ఆసియా మార్కెట్ల సంకేతాలతో భారత ఈక్విటీ బెంచ్‌మార్క్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఇంట్రాడేలో 82,783.5 పాయింట్ల వద్ద గరిష్టాన్ని తాకిన సెన్సెక్స్ 123 పాయింట్లు (0.15 శాతం) పెరిగి 82,515.14 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 కేవలం 37.15 పాయింట్లు లేదా 0.15 శాతం పెరిగి 25,141.4 వద్ద ముగిసింది. విస్తృత మార్కెట్లలో నిఫ్టీ మిడ్ క్యాప్ 100, నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 ఇండెక్స్‌లు వరుసగా 0.49 శాతం, 0.53 శాతం క్షీణించాయి. రంగాలవారీ సూచీలు మిశ్రమ ధోరణులను కనబరిచాయి. నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ 1.47 శాతం, ఐటీ 1.26 శాతం లాభపడ్డాయి. నిఫ్టీ ఆటో, ఎనర్జీ, ఫార్మా, రియల్టీ షేర్లు లాభాల్లో ముగియగా, నిఫ్టీ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎఫ్‌ఎంసీజీ, మీడియా, మెటల్, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ షేర్లలో హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫిన్సర్వ్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు లాభాల్లో ముగిశాయి. పవర్ గ్రిడ్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, నెస్లే ఇండియా, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు నష్టపోయాయి. మార్కెట్లలో అస్థిరతను అంచనా వేసే ఫియర్ ఇండెక్స్ (ఇండియా వీఐఎక్స్) 2.48 శాతం క్షీణించి 13.66 పాయింట్ల వద్ద స్థిరపడింది.







## దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL



# కేరళ సమీపంలో నౌకలో అగ్నిప్రమాదం

### నలుగురి జాడ గల్లంతు.. 18 మందిని రక్షించిన తీరగస్తీ బలగాలు


**కొచ్చి:** సింగపూర్ జెండాతో శ్రీలంక నుంచి ముంబైకి బయల్దేరిన విదేశీ కంటైనర్ సరకు రవాణా నౌక కేరళ సమీప సముద్రజలాల్లో అగ్నిప్రమాదానికి గురైంది. 22 మంది సిబ్బంది ఉన్న ఈ నౌక నుంచి 18 మందిని భారత తీర గస్తీ బలగాలు కాపాడాయి. 270 మీటర్ల పొడవైన ఎంవీ వాన్ హాయ్ 503 పేరు గల ఈ నౌకలో నలుగురి జాడ గల్లంతయింది. కేరళలోని కన్నూర్ జిల్లాలోని అఝిక్కల్ పట్టణ తీరం నుంచి 44 నాటికల్ మైళ్ల దూరంలో సోమవారం ఉదయం 9.20 గంటలకు ఈ దుర్ఘటన సంభవించింది. విషయం తెల్సిన వెంటనే భారత గస్తీ బలగాలు రంగంలోకి దిగి 18 మంది సిబ్బందిని కాపాడాయి. నౌకలో ఎనిమిది మంది చైనా, ఆరుగు తైవాన్, ఐదుగురు మయన్మార్, ముగ్గురు ఇండోనేసియాకు చెందిన సిబ్బంది ఉండగా వారిలో 18 మందిని రక్షించగాలిగారు. వీరిని ఐఎన్ఎస్ సూరత్ నౌకలో మంగళూరు పోర్ట్‌కు తీసుకొచ్చారు. షెడ్యూల్ ప్రకారం నౌక జూన్10వ తేదీకల్లా ముంబైలోని నవాషేవా ప్రాంతానికి చేరుకోవాల్సి ఉండగా మార్గమధ్యంలోనే ప్రమాదానికి గురైంది. గత 30 రోజుల్లో కేరళ సమీపంలో సరకు రవాణా నౌక ప్రమాదానికి గురికావడం ఇది రెండోసారి. మే 24న లైబీరియా జెండాతో వెళ్తున్న కార్గో నౌక తీరానికి 14.6 మైళ్లదూరంలో మునిగిపోయింది.




# కెన్యాలో రోడ్డు ప్రమాదం.. ఐదుగురు భారతీయులు మృతి

**దోహా:** ఖతార్‌లో నివసిస్తున్న ఐదుగురు భారతీయులు కెన్యాలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ వివరాలను దోహాలోని భారత రాయబార కార్యాలయం మంగళవారం వెల్లడించింది. విహారయాత్రలో భాగంగా 28 మంది ప్రవాసభారతీయుల బృందం ఖతార్ నుంచి కెన్యాకు వెళ్లింది. కెన్యాలోని నయాందారూ కౌంటీలో ఒల్ జొరోరోక్-నకూరూ రోడ్డులో వీళ్లు ప్రయాణిస్తున్న బస్సు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఐదుగురు చనిపోయారు. విషయం తెల్సుకున్న నైరోబీలోని భారత హైకమిషన్ అధికారులు హుటాహుటిన ఘటనాస్థలికి వెళ్లారు.

మృతదేహాల తరలింపు, క్షతగాత్రులకు సహాయక కార్యక్రమాల్లో అధికారులు నిమగ్నమయ్యారని దోహాలోని ఇండియన్ ఎంబసీ తెలిపింది. రోడ్డుపై అదుపు తప్పిన పర్యాటకుల బస్సు పక్కనే ఉన్న లోయలో పడిపోయిందని ది గల్ఫ్ టైమ్స్ వార్తాసంస్థ తన కథనంలో పేర్కొంది. చనిపోయిన ఆరుగురి వివరాలు ఇలా ఉన్నాయి. మృతుల్లో ఐదుగురు కేరళకు చెందిన వారుగా గుర్తించారు. మావెలిక్కరకు చెందిన గీతా షోజి ఐజాక్ (58), జస్నా కుట్టిక్కట్టుచలిల్ (29), రూహి మెహ్రీ ముహమ్మద్ (18 నెలలు), ఒట్టప్పలంకు చెందిన రియా ఆన్ (41), టైరా రోడ్రిగ్స్ (8)లు గుర్తించారు. రియా భర్త జోయెల్ మరియు ఆమె పెద్ద కుమారుడు రవిస్ (14) గాయాలతో న్యాండరువాలోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇక, ఈ ప్రమాదంలో గాయపడిన ప్రవాసభారతీయులను దగ్గర్లోని ఆస్పత్రుల్లో చేర్పించి చికిత్సనందిస్తున్నారు.



# శుభాన్షు అంతరిక్ష ప్రయాణం మళ్లీ వాయిదా





**న్యూఢిల్లీ:** భారతదేశపు రెండవ వ్యోమగామి శుభాన్షు శుక్లాను అంతరిక్షంలోకి తీసుకెళ్లే ఆక్సియం4 మిషన్ ప్రయోగం బుధవారం ఐదవసారి కూడా వాయిదా పడింది. ఫాల్కన్ 9 రాకెట్ రిపేర్ కారణంగా ఈ వాయిదా అనివార్యమయ్యింది. స్పేస్ ఎక్స్ ఈ విషయాన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫారం ఎక్స్‌లో తెలియజేసింది. పోస్ట్ స్టాటిక్ ఫైర్ బూస్టర్ తనిఖీల సమయంలో గుర్తించిన ఎల్ఓ ఎక్స్ లీక్‌ను రిపేర్ చేసేందుకు స్పేస్‌ఎక్స్ బృందాలకు అదనపు సమయం అవసరం కానుంది. వీరు ఫాల్కన్ 9 యాక్స్4 ప్రయోగం నుండి తిరిగి @Space_Station కు బయలుదేరుతున్నారు. మరమ్మత్తు పూర్తయిన తర్వాత తదుపరి ప్రయోగ తేదీని తెలియజేస్తామని స్పేస్‌ఎక్స్ పేర్కొంది. భారత వ్యోమగామి గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లాను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)కు పంపే ఆక్సియం4 మిషన్ ప్రయోగం ఐదోసారి వాయిదా పడింది. ఈ వాయిదాకు ముందు కూడా ప్రయోగ ప్రాంతంలో అనుకూలమైన వాతావరణం లేని కారణంగా వాయిదా పడిందని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) తెలిపింది. భారతదేశ అంతరిక్ష లక్ష్యాలకు ఒక మైలురాయిగా ఈ మిషన్ నిలుస్తుంది. యాక్సియమ్ స్పేస్, నాసా, స్పేస్‌ఎక్స్, ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)ల సహకారంలో ఈ ప్రయోగం జరుగుతోంది.

# స్కూల్లో ఘోరం..

### తోటి విద్యార్థులపై కాల్పులు, 11 మంది మృతి

**గ్రాజ్:** ఆస్ట్రియా దేశం గ్రాజ్ నగరంలో ఘోరం జరిగింది. బోర్గ్ డ్రైయర్షుట్సెన్గాసే హై స్కూల్లో ఓ విద్యార్థి తోటి విద్యార్థులపై కాల్పులకు తెగబడ్డాడు. ఈ దారుణంలో 11 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రాజ్ నగరం స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 10 గంటల ప్రాంతంలో నిందితుడు గన్నుతో కాల్పులు జరిపినట్లు తమకు సమాచారం అందినట్లు పోలీసులు తెలిపారు. అయితే, కాల్పుల అనంతరం విద్యార్థి తనని తాను గన్నుతో కాల్చుకొని ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. దాడి తర్వాత, గ్రాజ్ పాఠశాలను ఖాళీ చేయించారు. విద్యార్థులను సమీపంలోని హెల్మట్ లిస్ట్ హాల్‌కు తరలించారు.అక్కడ వారికి రెడ్‌క్రాస్ చికిత్స అందించింది. ఘటనపై అప్రమత్తమైన పోలీసులు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. కాల్పుల శబ్ధం విన్న వెంటనే పోలీసులు స్థానికుల్ని అప్రమత్తం చేశారు. కాల్పులు జరిగిన ప్రాంత ప్రజలు బహిరంగంగా తిరగకూడదని, ఇళ్లలోనే ఉండాలని సూచించారు.



# ప్రసూతి వార్డునూ వదలని రష్యా డ్రోన్లు

**కైవ్:** రష్యా మరోమారు ఉక్రెయిన్‌పై భీకర దాడులకు దిగింది. రాజధాని కైవ్‌ను లక్ష్యంగా చేసుకుని, ఇక్కడి ఒడెసాలోని ఒక ఆస్పత్రిలోని ప్రసూతివార్డుపై డ్రోన్లతో దాడి చేసింది. దీనికి సంబంధించిన వివరాలను ఉక్రెయిన్ మీడియాకు తెలిపింది. దీనికిముందు కూడా ఉక్రెయిన్‌పై రష్యా డ్రోన్లతో భారీ దాడులకు తెగబడింది. ఉక్రెయిన్ ఇటీవల జరిపిన దాడులకు ప్రతిగా రష్యా వరుస దాడులను కొనసాగిస్తోంది. శత్రు డ్రోన్లు నగరంలోని అనేక జిల్లాలపై ఒకేసారి దాడి చేస్తున్నాయని కైవ్ సైనిక పరిపాలన అధికారి తైమూర్ త్కాచెంకో టెలిగ్రామ్ మెసేజింగ్ యాప్‌లో తెలిపారు. నివాస భవనాలను మంటలు చుట్టుముట్టాయని, రెస్క్యూ సిబ్బంది సంఘటనా స్థలంలో సేవలు అందిస్తున్నారని అన్నారు. దక్షిణ ఒడెసా ఓడరేవులో భారీ డ్రోన్ దాడి జరిగిందని, అలాగే అత్యవసర వైద్య భవనం, ప్రసూతి వార్డుతో పాటు నివాస భవనాలను లక్ష్యంగా చేసుకుని, డ్రోన్ దాడులు కొనసాగుతున్నాయని ఒడెసా ప్రాంతీయ గవర్నర్ ఒలేహ్ కైపర్ టెలిగ్రామ్‌లో తెలిపారు. ప్రసూతి ఆసుపత్రిపై జరిగిన దాడిలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని, బాధితులు, సిబ్బంది అప్రమత్తమై ముందుగా భవనాన్ని ఖాళీ చేశారని తెలిపారు. అయితే భవనం ధ్వంసమయ్యిందని పేర్కొంటూ, దీనికి సంబంధించిన ఫోటోలను ఆయన షేర్ చేశారు. మూడేళ్ల క్రితం ఉక్రెయిన్‌పై రష్యా ప్రారంభించిన ఈ యుద్ధంలో వేలాదిమంది పౌరులు మరణించారు. వారిలో అధిక శాతం ఉక్రేనియన్లు ఉన్నారు.





# భారీ బడ్జెట్‌తో షారుక్-సల్మాన్ సినిమా

## గెస్ట్ రోల్స్‌లో ఎన్టీఆర్, హృతిక్!



వైఆర్ఎఫ్ (యశ్ రాజ్ ఫిల్మ్స్) స్పై యూని వర్స్‌లో భాగంగా ఇప్పటివరకు సల్మాన్ ఖాన్ హీరోగా చేసిన 'ఏక్తా టైగర్' (2012), 'టైగర్ జిందా హై' (2017), 'టైగర్ 3' (2023), హృతిక్ రోషన్ 'వార్' (2019), షారుక్ ఖాన్ 'పఠాన్' (2023) వంటి సినిమాలు సూపర్ హిట్స్‌గా నిలిచాయి. ఈ యూనివర్స్‌లోనే హృతిక్ రోషన్ – ఎన్టీఆర్ హీరోలుగా చేసిన 'వార్ 2', ఆలియా భట్ – శర్వారీ లీడ్ రోల్స్ చేసిన 'ఆల్ఫా' చిత్రం రిలీజ్‌కు సిద్ధమౌతున్నాయి. 'వార్ 2' సినిమా ఆగస్టు 14న విడుదల కానుంది. 'ఆల్ఫా' చిత్రం ఈ ఏడాది డిసెంబరు 25న విడుదల కానుంది. కాగా... రెండు సంవత్సరాలుగా ఈ 'వైఆర్ఎఫ్' స్పై యూనివర్స్‌లో భాగంగానే 'పఠాన్ వర్సెస్ టైగర్'(Pathaan Vs Tiger)చిత్రం రానుందని, ఈ మూవీలో షారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్ హీరోలుగా చేస్తారని, అలాగే 'పఠాన్ వర్సెస్ టైగర్' సినిమాలో ఈ యూనివర్స్‌లో భాగమైన హృతిక్ రోషన్, జాన్ అబ్రహాం, ఆలియా భట్, ఎన్టీఆర్ గెస్ట్ రోల్స్‌లో కనిపిస్తారనే ప్రచారం జరుగుతోంది. భారీ బడ్జెట్‌తో రూపొందనున్న ఈ సినిమాని 'వార్, పఠాన్' సినిమాలకు దర్శకత్వం వహించిన సిద్ధార్థ్ ఆనంద్ తెరకెక్కిస్తారనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది. దీంతో ఈ సినిమాపై అంచనాలు ఏర్పడ్డాయి. కానీ హఠాత్తుగా 'పఠాన్ వర్సెస్ టైగర్' చిత్రం ఆగిపోయిందనే టాక్ తెరపైకి వచ్చింది. కానీ అలాంటిది ఏమీ లేదని, 'వార్ 2', 'ఆల్ఫా' చిత్రాలు విడుదలైన తర్వాత 'పఠాన్ వర్సెస్ టైగర్' సినిమా గురించి ఓ స్పష్టత వస్తుందని జాతీయ ఆంగ్ల మీడియాలో వార్తలు వస్తున్నాయి. దీంతో సిల్వర్ స్క్రీన్‌పై 'పఠాన్–టైగర్'ల పోరు ఉంటుందని, కాకపోతే కొంత సమయం పడుతుందని తెలుస్తోంది.

## ఎల్‌సీయూలోకి ముగ్గురు భామలు..

# ఏం ప్లాన్ చేస్తున్నారో?

సినిమాటిక్ యూనివర్స్ అనగానే గుర్తొచ్చే పేరు లోకేశ్ కనగరాజ్. ఖైదీ, విక్రమ్ సినిమాలని ఒకదానికొకటి లింక్ చేసిన ఇతడు.. ఎల్‌సీయూ సృష్టించాడు. ప్రస్తుతం రజనీకాంత్‌తో 'కూలీ' తీస్తున్నాడు. ఇది ఆగస్టులో రిలీజ్ కానుంది. ఓవైపు దర్శకత్వం వహిస్తూనే మరోవైపు నిర్మాతగానూ పలు చిత్రాలు చేస్తున్నాడు. అందులో ఒకటే 'బెంజ్'. లారెన్స్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రం గురించి ఇప్పుడు క్రేజీ రూమర్ ఒకటి వినిపిస్తోంది. సాధారణంగా యాక్షన్ సినిమాల్లో హీరోయిన్లకు పెద్దగా ఇంపార్టెన్స్ ఉండదు. లోకేశ్ ఇప్పటివరకు తీసిన చిత్రాల్లోనూ హీరోయిన్లు కనిపించేది కూడా తక్కువే అని చెప్పొచ్చు. కానీ 'బెంజ్'లో మాత్రం ఏకంగా ముగ్గురు భామల్ని తీసుకున్నారట. వాళ్లలో సంయుక్త, ప్రియాంక మోహన్ ఇప్పటికే ఖరారు కాగా.. మడోన్నా సెబాస్టియన్‌ని కూడా తీసుకోవాలని చూస్తున్నారట. సంయుక్త, ప్రియాంక హీరో సరసన నటిస్తారని.. మడోన్నా మాత్రం విలన్ వాల్టర్‌గా చేస్తున్న నివీన్ పౌలీ పక్కన కనిపించబోతుందని అంటున్నారు. ఇందులో నిజమెంత ఉందనేది తెలియాల్సి ఉంది. రీసెంట్‌గా 'బెంజ్' విలన్‌కి సంబంధించిన ఓ వీడియోని రిలీజ్ చేసి నివీన్ పౌలీ పాత్రని పరిచయం చేశారు. లోకేష్ యూనివర్స్‌లో ఈ మూవీ కూడా భాగమేనని చెప్పుకొచ్చారు. మరి ఎలా ఏ సినిమాతో లింక్ చేస్తారనేది ఇంకా సస్పెన్స్. ఈ చిత్రానికి భాగ్యరాజ్ కన్నన్ దర్శకుడు. లోకేశ్ ప్రస్తుతం 'కూలీ' తీస్తున్నాడు. దీని తర్వాత 'ఖైదీ 2' ఉంటుంది. అలానే రోలెక్స్, విక్రమ్ 2 చిత్రాల్ని కూడా తీస్తానని ఇదివరకే చెప్పాడు. అయితే కొన్నిరోజులుగా ఆమిర్ ఖాన్‌తో ఓ సూపర్ హీరో మూవీ చేయబోతున్నాడనే టాక్ కూడా వినిపిస్తుంది. చూడాలి మరి వీటిలో ఏది ముందు మొదలవుతుందో?



## బర్త్‌డే పార్టీలో గంజాయి కలకలం..


# చిక్కుల్లో సింగర్ మంగ్లీ

టాలీవుడ్‌లో మరోసారి డ్రగ్స్ కలకలం రేగింది. ప్రముఖ సింగర్ మంగ్లీ(Singer Mangli) బర్త్‌డే పార్టీలో గంజాయి సరఫరా చేసినట్లు పోలీసులు గుర్తించారు. బర్త్ డే సందర్భంగా మంగ్లీ నిన్న(జూన్ 10) హైదరాబాద్ సమీపంలోని చేవెళ్ల త్రిపుర రిసార్ట్‌లో మందు పార్టీ ఏర్పాటు చేశారు. ఈ పార్టీలో విదేశీ మద్యంతో పాటు గంజాయి కూడా సరఫరా చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు.. రిసార్ట్‌పై దాడి చేసి విదేశీ మద్యం సీజ్ చేశారు. అలాగే పార్టీకి హాజరైన 48 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. 9 మందికి గంజాయి పాజిటివ్‌గా తేలిందని పోలీసులు తెలిపారు. సింగర్‌తో పాటు రిసార్ట్ యాజమాన్యంపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఫోక్ సాంగ్స్‌తో ఫేమస్ అయిన మంగ్లీ. ఆ ఫేంతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. తనదైన స్టైల్లో పాటలు ఆలపిస్తూ..తక్కువ సమయంలోనే స్టార్ సింగర్‌గా ఎదిగింది. బన్నీ, ఎన్టీఆర్, మహేశ్ బాబుతో పాటు పలువురు స్టార్ హీరోల సినిమాలకు ఆమె పాటలు పాడింది.



## మళ్లీ రెచ్చగొట్టిన రష్మిక..

# ఈసారి ఏం చేస్తారో?



రష్మిక స్వతహాగా కన్నడ అమ్మాయి. కానీ ఆ రాష్ట్రానికి చెందిన ప్రేక్షకులే ఈమెని ఎప్పటికప్పుడు విమర్శిస్తుంటారు. దానికి కారణాలు కూడా ఉన్నాయి. గతంలో పలుమార్లు ఈమే మాట్లాడిన మాటలే దీనికి కారణం అని చెప్పొచ్చు. మరి తెలిసి చేసిందో తెలియక చేసిందో గానీ ఇప్పుడు మరోసారి కన్నడని కెలికింది. అసలే కమల్ హాసన్ వల్ల కోపంతో ఉన్నారు. ఇప్పుడు రష్మిక లేటెస్ట్ పోస్ట్ చూసి షాకవుతున్నారు. రష్మిక నటించిన లేటెస్ట్ మూవీ 'కుబేర'. శేఖర్ కమ్ముల తీసిన ఈ సినిమా జూన్ 20న పాన్ ఇండియా వైడ్ రిలీజ్ కానుంది. ఈ చిత్ర ప్రమోషన్స్ ప్రస్తుతం జోరుగా సాగుతున్నాయి. నిన్ననే ముంబైలో ఓ ఈవెంట్ జరగ్గా.. అంతకు ముందు దక్షిణాదిలోనూ జరిగాయి. ఈ క్రమంలోనే రష్మిక తన ఇన్ స్టాలో కొన్ని ఫొటోలు పోస్ట్ చేయడంతో పాటు చెన్నైతో తనకున్న అనుబంధాన్ని షేర్ చేసుకుంది. ఇప్పడదే కన్నడిగుల ఆగ్రహం తెప్పిస్తోంది.

రష్మిక పోస్ట్‌లో ఏముందంటే.. 'చెన్నైలోనే తన బాల్యం గడిచింది. అందుకే చెన్నైకి నా హృదయంలో ప్రత్యేక స్థానం ఉంది' అని రాసుకొచ్చింది. అంటే ఓ రకంగా తనది చెన్నై అన్నట్లు చెబుతోంది. ఇది ఇప్పుడు కన్నడిగులకు అసంతృప్తి తెప్పిస్తోంది. ఎందుకంటే రష్మిక పుట్టి పెరిగింది, స్కూల్ చదువుకున్నదంతా కర్ణాటకలోనే. కానీ చెన్నైలో బాల్యం గడపడం ఏంటి అని కన్నడ నెటిజన్లు మాట్లాడుకుంటున్నారు. గతంలో 'కాంతార' సినిమాని తాను ఇంకా చూడలేదని చెప్పి ట్రోలింగ్‌కి గురైన రష్మిక.. మరో సందర్భంలో హైదరాబాద్ తనకు ఇల్లు లాంటిదని చెప్పి కన్నడిగుల ఆగ్రహానికి గురైంది. ఇప్పుడు మరి ఉద్దేశపూర్వకంగా చేసిందో లేదో తెలీదు గానీ ఈమె పెట్టిన పోస్ట్ సోషల్ మీడియాలో చర్చనీయాంశమవుతోంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com